'మామిడి తోటలతో అధిక లాభాలు'

నెల్లికుదురు, సెప్టెంబరు 19 (ఆంధ్రజ్యోతి) : రైతులు మామిడి తోటల సాగుతో అధిక లాభాలను సాధించవచ్చునని జిల్లా పట్టుపరిశ్రమ, ఉద్యానవన శాఖ అధికారి జినుగు మరియన్న అన్నారు. శుక్రవారం మండలంలోని వివిధ గ్రామాలలో రైతులు సాగుచేసిన మామిడి, ఆయిల్‌పామ్ తోటలు, కూరగాయల ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ రైతులు ఎకరానికి 70 నుంచి 160 వరకు అధిక సాంద్రత పద్ధతిలో మామిడి మొక్కలు నాటుకొని, దిగుబడులు పొందవచ్చన్నారు. మార్కెట్‌లో డిమాండ్ ఉన్న దోశెరి, హిమయత్, కేసరి, అల్ఫోన్సా, బెనేషన్, మల్లికా, గులాబీ, మొక్కలు సాగు చేసుకోవాలన్నారు.

ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY








మహబూబాబాద్ గౌతమి జూనియర్ కళాశాలలో బతుకమ్మ వేడుకలో పాల్గొన్న కళాశాల డైరెక్టర్ తక్కెళ్లపల్లి సంధ్యారాణి రవీందర్‌రావు (ఫైల్)



మహబూబాబాద్ మహర్షి విద్యాలయలో బతుకమ్మ వేడుకలో పాల్గొన్న కరస్పాండెంట్ సుధాఅర్జున్‌రెడ్డి (ఫైల్) .

- ఆడపడుచుల సందడితో పరవశించనున్న పూలపండుగ
- ప్రకృతితో ప్రకృతిని ఆరాధించే.. తెలంగాణ బతుకమ్మ
- ఎంగిలిపూల బతుకమ్మతో ప్రారంభమై.. సద్దుల బతుకమ్మతో ముగింపు
- రోజుకో తీరు నైవేద్యం.. ఆటపాటలతో సందడి

పూల జాతర

రేపటి నుంచి బతుకమ్మ సంబురాలు షురూ



మహబూబాబాద్ ఎడ్యుకేషన్, సెప్టెంబరు 19 (ఆంధ్రజ్యోతి) : జిల్లాలో ఆదివారం నుంచి పూల పండుగ ప్రారంభం కానుంది. ఎంగిలిపూల బతుకమ్మతో పూల జాతర షురూ కానుంది. ఇప్పటికే ప్రతీ పల్లెతో పాటు పట్టణాల్లో పండుగ సందడి నెలకొంది. తెలుగింటి మహిళలంతా ఆనందంగా బతుకమ్మ వేడుకలను నిర్వహించుకునేందుకు సన్నద్ధమయ్యారు. ఈ నెల 21న ఎంగిలిపూల బతుకమ్మలతో పండుగ ఆరంభమై.. 29 వరకు సద్దుల బతుకమ్మతో సంబురంగా ముగిస్తారు.

ఆటపాటలతో, ఆనందోత్సాహాల మధ్య..

ప్రకృతితో మమేకమై ఆటపాటలతో, ఆనందోత్సాహాల మధ్య పండుగ జరుపుకోవాలనేదే బతుకమ్మ ప్రధాన ఉద్దేశం. ప్రతీ సంవత్సరం ఈ పండుగ సమీపించే సమయానికి ప్రకృతి అంతా పూలవనంగా మారిపోతుంది. ప్రకృతిలో సేకరించిన పూలను ప్రకృతికే సమర్పించుకోవాలనే బతుకమ్మలను నీటిలో నిమజ్జనం పేరిట విడిచిపెడతారు. నిత్యనూతనమై తెలంగాణ వాకిట్లో సిరులొలికించే ప్రకృతి పండుగ బతుకమ్మను మహిళలు భక్తి పరవశంతో జరుపుకోవడం ఆనవాయితీ. వర్షాకాలపు చివర్లో, శీతాకాలపు తొలి రోజుల్లో వచ్చే ఈ పండుగ వేళ వర్షాలతో జలాశయాలు కళకళలాడుతుంటాయి. రకరకాల పువ్వులు, రంగురంగులతో ఆరుబయళ్లలో వికసించి ప్రకృతికే కనువిందు చేస్తుంటాయి. ఇందులో గునుగుపూలు, తంగేడు పూలు ఎక్కడ చూసినా విరబూసే ఉంటాయి. బంతి, చేమంతి, నందివర్ధనం లాంటి పూలకు కూడా ఇదే సీజన్. బతుకమ్మ ప్రారంభానికి కొద్ది రోజుల ముందే మట్టితో తయారు చేసిన బొడ్డెమ్మలను ఆరాధిస్తారు.

పెత్రమాసతో ప్రారంభమై..

ఆశ్వీయుజ మాసం పెత్రమాస (మహాలయ అమావాస్య, పితృ అమావాస్య)తో బతుకమ్మ వేడుకలు ఆరంభమవుతాయి. అష్టమి వరకు కొనసాగే ఈ పండుగలో కేవలం ఆచారమే కాదు.! శాస్త్రీయత దాగి ఉంది. కొత్త బట్టలు ధరించి ఇత్తడి తాంబూలంలో గుమ్మడి ఆకులు పరిచి వాటి మీద తంగేడు పూలు పేరుస్తారు. కాస్త ఎత్తులో పూలను పేర్చిన తర్వాత గునుగు, బంతి, చామంతి, అడవి చామంతి, ముత్యాలపువ్వు, రుద్రాక్ష, నీల గోరింట, పట్టుకుచ్చులు, కట్ల, బీర ఇలా బతుకమ్మలను పేర్చడంలో రకరకాల పూలను వినియోగిస్తారు.

ఏ రోజు ఏ బతుకమ్మ అంటే..

ఈనెల 21తొలి రోజు ఎంగిలిపూల బతుకమ్మ, 22న రెండో రోజు అటుకుల బతుకమ్మ, 23న మూడో రోజు ముద్దపప్పు బతుకమ్మ, 24న నాల్గోరోజు నానబియ్యం బతుకమ్మ, 25న ఐదో రోజు అట్ల బతుకమ్మ, 26న ఆరోరోజు అలిగిన బతుకమ్మ, 27న ఏడోరోజు వేపకాయల బతుకమ్మ, 28న ఎనిమిదో రోజు వెన్నముద్ద బతుకమ్మ, 29 తొమ్మిదోరోజు సద్దుల బతుకమ్మ ఇలా రోజుకో పేరుతో అమ్మవారిని కొలుస్తారు. ఆరో రోజున అలిగిన బతుకమ్మకు నివేదన ఉండదు. మిగిలిన రోజుల్లో రకరకాల ప్రసాదాలను గౌరమ్మకు నైవేద్యంగా సమర్పిస్తారు.

పూలల్లో ఎన్నెన్నో ఔషధగుణాలు..

బతుకమ్మకు వాడే పూలన్నీ ఎన్నెన్నో ఔషధగుణాలు కలిగి ఉంటాయి. ఇందులో తంగేడు పూలు గొంతు, మూత్ర సంబంధిత సమస్యలకు ఔషధం. గునుగు పువ్వు యాంటీ డయేరియా, యాంటీ డయాబెటిక్ లక్షణాలు కలిగి ఉంటుంది. బంతిపువ్వు క్రిమిసంహారిణి, దోమలను నివారించే శక్తి కలిగి ఉంటుంది. చామంతిని కాలిన గాయాలకు, దెబ్బలకు, కంటి సంబంధిత రోగాలకు, జీర్ణానికి ఔషధంగా వాడతారు. ఇది యాంటీ బ్యాక్టీరియా లక్షణాలు కలిగి కాలుష్య కారకాలను బెంజీన్, అమ్మోనియా వాయువులను పీల్చుకుని గాలిని శుద్ధి చేస్తుంది. ఇలా బతుకమ్మ పేరిట వాడే ప్రతీ పువ్వుకు అనేక ఔషధ గుణాలున్నాయి. ఈ పూలన్నంటినీ గోపురంలా పేర్చాక పైన గుమ్మడి పువ్వుగొడుగు పెడతారు. తమలపాకులో పసుపుతో చేసిన గౌరమ్మను ఉంచి పక్కనే దీపం వెలిగిస్తారు. పసుపు శుభసూచకం. అంతేకాదు క్రిమి సంహారిణి కూడా. ఇక దీపం జ్ఞానానికి సంకేతం. అది గాలిని శుద్ధి చేస్తుంది. క్రిములను హరిస్తుంది. బతుకమ్మల్లోని పూలకున్న ఔషధగుణాలు నిమజ్జనం సందర్భంగా (మిగతా 8లో..)

రూ.1025 కోట్లతో అభివృద్ధి పనులు

- స్టేషన్‌ఘన్‌పూర్ నియోజకవర్గ సమగ్రాభివృద్ధే ధ్యేయం
- నాపై నమ్మకంతో ప్రజలు గెలిపించారు
- మాట నిలబెట్టుకునేందుకే కాంగ్రెస్‌తో కలిసి పని చేస్తున్నా
- విద్య, వైద్య, నీటిపారుదల రంగాల్లో విప్లవాత్మక ప్రగతి
- స్పీకర్ నిర్ణయంపై భవిష్యత్తు రాజకీయ ప్రణాళిక
- మాజీ ఉప ముఖ్యమంత్రి, ఎమ్మెల్యే కడియం శ్రీహరి



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న మాజీ ఉపముఖ్యమంత్రి, ఎమ్మెల్యే కడియం శ్రీహరి

హనుమకొండ, సెప్టెంబరు 19 (ఆంధ్రజ్యోతి) : గడచిన 21 నెలల కాలంలో స్టేషన్ ఘన్‌పూర్ నియోజకవర్గంలో రూ.1025.64 కోట్లతో వివిధ అభివృద్ధి పనులు చేపట్టినట్టు మాజీ ఉప ముఖ్యమంత్రి, ఎమ్మెల్యే కడియం శ్రీహరి తెలిపారు. హనుమకొండ నక్కలగుట్టలోని హరిత హోటల్‌లో శుక్రవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ గత పదిహేనేళ్లుగా అభివృద్ధిలో పూర్తిగా వెనుకబడిన స్టేషన్ ఘనపూర్ నియోజకవర్గాన్ని తాను ఎమ్మెల్యేగా గెలిచిన తర్వాత సర్వతోముఖంగా అభివృద్ధి చేస్తున్నానని తెలిపారు. కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రావడంతో నియోజకవర్గ అభివృద్ధిలో ఒక ప్రతిపక్ష పార్టీగా బీఆర్ఎస్ పాత్ర పరిమితం కనుక ప్రజలు నష్టపోవద్దన్న ఉద్దేశ్యంతో సంవత్సరన్నర కాలం నుంచి కాం గ్రెస్ ప్రభుత్వంతో కలిసి పని చేస్తున్నానని స్పష్టం చేశారు. సీఎం రేవంత్ రెడ్డి తనపై ఉన్న గౌరవంతో అడిగిందే తడవుగా అనేక పనులకు ఉదారంగా నిధులు మంజూరు చేశారని అన్నారు. సాగునీటి సరఫరాకు సంబంధించి నియోజకవర్గంలో విప్లవాత్మకమైన ప్రగతి చోటు చేసుకున్నదన్నారు. ప్రస్తుతం నియోజకవర్గంలో 80 శాతం గ్రామాలకు గోదావరి జలాలు (మిగతా 7లో..)

స్పీకర్ నిర్ణయానికి కట్టుబడి ఉంటా

స్పీకర్ తీసుకునే నిర్ణయానికి కట్టుబడి ఉంటాననీ, ఆయన నిర్ణయాన్ని బట్టే తన రాజకీయ భవిష్యత్ ప్రణాళిక ఉంటుందని శ్రీహరి అన్నారు. స్పీకర్ నోటీసుకు జవాబు ఇవ్వడానికి ఈ నెలాఖరు వరకు సమయం ఉందన్నారు. పార్టీ మారడాలు దేశ వ్యాప్తంగా జరుగుతున్నదన్నారు. నియోజకవర్గ ప్రజల సంక్షేమానికి కొన్ని సార్లు కొన్ని నిర్ణయాలు తీసుకోవలసి ఉంటుందన్నారు.



సిబ్బందికి రేయిన్‌కోట్స్, ఉలెన్ జాకెట్స్ అందచేస్తున్న సుధీర్‌రాంనాథ్ కేకన్

నిబద్ధతతో పనిచేస్తేనే గుర్తింపు

ఎస్పీ సుధీర్‌రాంనాథ్ కేకన్

మహబూబాబాద్ క్రైం, సెప్టెంబరు 19 (ఆంధ్రజ్యోతి) : విధుల పట్ల నిబద్ధతతో పని చేస్తేనే శాఖాపరమైన గుర్తింపుతో పాటు సమాజంలో గౌరవ మర్యాదలు పెంపొందుతాయని ఎస్పీ సుధీర్‌రాంనాథ్ కేకన్ అన్నారు. మానుకోట జిల్లా పోలీస్ కార్యాలయంలో హోంగార్డ్స్, పోలీసు సిబ్బందికి రేయిన్ కోట్స్, ఉలెన్ జాకెట్స్‌ను శుక్రవారం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ హోంగార్డ్స్, పోలీసు సిబ్బందికి విధి నిర్వహణలో వ్యక్తిగతం, శాఖా పరమైన సమస్యలు ఉంటే ఉన్నతాధికారుల దృష్టికి తీసుకువస్తే ఎలాంటి సమస్యలైనా పరిష్కరించేందుకు కృషి చేస్తామన్నారు. యూనిఫాం సర్వీస్ డెలివరీలో చిన్నా, పెద్ద తేడాలేకుండా అందరం ఒకే కుటుంబసభ్యులమన్నారు. ఈ కార్యక్రమంలో డీసీఆర్‌డీ ఇనిస్పెక్టర్ సత్యనారాయణ, ఆర్.భాస్కర్, హోంగార్డ్స్, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

అగ్రవర్ణాల పెత్తనం కొనసాగనివ్వం

- బీఆర్ఎస్, బీజేపీ, కాంగ్రెస్ నాయకులు బీసీ ద్రోహులు
- బీసీలకు ఏడాదికి రూ.లక్ష కోట్లు బడ్జెట్ కేటాయించాలి
- టీఆర్‌పీ రాష్ట్ర కార్యవర్గ సమావేశంలో తీన్మార్ మల్లన్న



మాట్లాడుతున్న టీఆర్‌పీ వ్యవస్థాపక అధ్యక్షుడు, ఎమ్మెల్సీ తీన్మార్ మల్లన్న

హనుమకొండ టౌన్, సెప్టెంబరు 19 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలోని బీసీ ప్రజలపై, అధికారులపై అగ్రవర్ణాల పెత్తనం కొనసాగనివ్వమని తెలంగాణ బీసీ రాజ్యాధికార పార్టీ (టీఆర్‌పీ) వ్యవస్థాపక అధ్యక్షుడు, ఎమ్మెల్సీ తీన్మార్ మల్లన్న హెచ్చరించారు. రాష్ట్రంలో బీసీల ద్రోహిగా బీఆర్ఎస్, బీజేపీ, కాంగ్రెస్ పార్టీలు నిలిచాయని అన్నారు. శుక్రవారం హనుమకొండ నక్కలగుట్టలోని హరిత కాకతీయ హోటల్‌లో టీఆర్‌పీ రాష్ట్ర నూతన కార్యవర్గ సమావేశం రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ రజినీకుమార్ ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సమావేశంలో టీఆర్‌పీ ఎజెండా, డిక్లరేషన్‌ను ప్రకటించారు. అనంతరం విలేకరుల సమావేశంలో ఎమ్మెల్సీ తీన్మార్ మల్లన్న మాట్లాడారు. వచ్చే ఎన్నికల్లో టీఆర్‌పీ అధికారంలోకి రాగానే టీఆర్‌పీ వరంగల్ డిక్లరేషన్ ద్వారా 10 ఎజెండా తీర్మానాలు అమలు చేస్తామని తెలిపారు. విద్య, ఉద్యోగాల్లో బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు కల్పించడం, బీసీలకు రాష్ట్ర బడ్జెట్‌లో ఏడాదికి రూ.లక్ష కోట్ల కేటాయింపులు, తెలంగాణ రాష్ట్రానికి జాతిపితగా ప్రొఫెసర్ జయశంకర్ సార్ పేరు, కొండా లక్ష్మణ్ బాపూజీకి భారతరత్న ఇవ్వాలని డిమాండ్, భూమి లేని 18 లక్షల నిరుపేద బీసీ కుటుంబాలకు ఒక్కో కుటుంబానికి రెండు ఎకరాల చొప్పున పంపిణీతోపాటు అగ్రవర్ణాలలోని నిరుపేదలకు కూడా (మిగతా 8లో..)

కాలనీల సమస్యల పరిష్కారానికి కృషి చేయాలి

- సీపీఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యుడు సూర్నపు సోమయ్య



రిలే నిరాహార దీక్షలో మాట్లాడుతున్న సూర్నపు సోమయ్య

మహబూబాబాద్ టౌన్, సెప్టెంబరు 19 (ఆంధ్రజ్యోతి) : పట్టణ శివారు కాలనీల్లో నెలకొన్న సమస్యల పరిష్కారానికి అధికారులు, పాలకులు కృషి చేయాలని సీపీఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యుడు సూర్నపు సోమయ్య డిమాండ్ చేశారు. మహబూబాబాద్ మునిసిపల్ 15 వార్డు పరిధిలో నెలకొన్న సమస్యలను తక్షణమే పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ సీపీఎం వన్‌టౌన్ కార్యదర్శి రావుల రాజు ఆధ్వర్యంలో స్థానికగిరిప్రసాద్‌నగర్ మెయిన్‌రోడ్‌పై శుక్రవారం రిలే నిరాహార దీక్షను చేపట్టారు. ఈ సందర్భంగా ఆయనదీక్షను ప్రారంభించి, మాట్లాడారు. మునిసిపల్ 15వ వార్డు పరిధిలోని గిరిప్రసాద్‌నగర్, సుందరయ్యనగర్‌తండా, ఆర్టీసీ కాలనీ, బీటీఆర్‌నగర్, రెడ్యానాయక్ కాలనీలు అనేక సమస్యలతో కొట్టుమిట్టాడుతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. ఆయా కాలనీల్లో మిషన్ భగీరథ పైపులైన్ లేక మంచినీటి సమస్య తలెత్తుతుందని చెప్పారు. అంతర్గత రోడ్లు దెబ్బతిని గుంతలమయం కావడంతో వాహనదారులు ఇబ్బందులు పడుతున్నారని, శ్మశాన వాటిక లేక రోడ్డు వెంట దహన సంస్కారాలు చేస్తున్నారని వాపోయారు. శివారు కాలనీల్లో మౌళిక వసతులు లేక దుర్భర జీవితం గడపాల్సిన దైన్యస్థితి నెలకొందని పాలకులు, అధికారులు ఆలోచించాలని కోరారు. ఈ దీక్షలో చీపిరి యాకయ్య, శాగంటి భాగ్యమ్మ, తోట శ్రీనివాస్, రజాక్, వెంకన్న, వినయ్, శ్రీనివాస్, మల్లెశం, సీతారాములు, సావిత్రి, విశ్వనాథం, గణేష్, పద్మ, మౌనిక పాల్గొన్నారు.

ఆర్టీసీ నూతన డీఎంగా కల్యాణి



మానుకోటలో ఆర్టీసీ డిపో మేనేజర్‌గా శివప్రసాద్ నుంచి బాధ్యతలను స్వీకరిస్తున్న నూతన డీఎం కల్యాణి

మహబూబాబాద్ టౌన్, సెప్టెంబరు 19 (ఆంధ్రజ్యోతి) : మహబూబాబాద్ ఆర్టీసీ డిపో మేనేజర్‌గా వి.కల్యాణి బాధ్యతలు స్వీకరించారు. ఇక్కడ డీఎంగా పని చేసిన శివప్రసాద్ ఖమ్మం డిపోకు బదిలీపై వెళ్లగా, ముషీరాబాద్ డిపోలో సీఐగా పని చేస్తున్న కల్యాణి పదోన్నతిపై మానుకోట డిపో మేనేజర్‌గా బదిలీ అయ్యారు. శివప్రసాద్ నుంచి నూతన డీఎంగా కల్యాణి శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు. అనంతరం కల్యాణిని ఉద్యోగులు, సిబ్బంది శాలువాలతో సత్కరించారు. శ్రీమన్నారాయణ, పాపిరెడ్డి, రుక్మిణి పాల్గొన్నారు.

ఒక్కరోజే 600 మెట్రిక్ టన్నుల యూరియా పంపిణీ

- జిల్లాలో ఇప్పటి వరకు 29,065 మెట్రిక్ టన్నులు అందించాం
- జిల్లా వ్యవసాయాధికారి విజయనిర్మల

మహబూబాబాద్ అగ్రికల్చర్, సెప్టెంబరు 19 (ఆంధ్రజ్యోతి) : జిల్లాలో శుక్రవారం ఒక్కరోజే 600 మెట్రిక్ టన్నుల యూరియాను రైతులకు అధికారులు పంపిణీ చేశారు. బయ్యారం, గార్ల, డోర్నకల్ మండలాల్లో యూరియా బస్తాల పంపిణీ జరిగింది. జిల్లా వ్యాప్తంగా ఇప్పటి వరకు 29,065 మెట్రిక్ టన్నుల యూరియాను పంపిణీ చేసినట్లు జిల్లా వ్యవసాయాధికారి విజయనిర్మల తెలిపారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ కలెక్టర్ అద్వైత్‌కుమార్‌సింగ్, అదనపు కలెక్టర్లు లెనిన్‌వత్సల్‌టొప్పో, అనిల్‌కుమార్, ఎస్పీ సుధీర్‌రామ్‌నాథ్ కేకన్, జిల్లా వ్యవసాయశాఖ ఏడీఏలు విజయచంద్ర, శ్రీనివాసరావు, ఆర్డీవోలు, జిల్లా అధికారుల పర్యవేక్షణలో సజావుగా యూరియా పంపిణీ కొనసాగుతుందన్నారు. యూరియా కొరత ఎక్కడా లేదని, రైతులకు అందుబాటులో యూరియా ఉందని, ఎవరూ ఆందోళన చెందాల్సిన అవసరం లేదని చెప్పారు. ఒక్కరోజు ముందుగానే పక్కా ప్రణాళికతో యూరియా పంపిణీ చేయడం జరుగుతుందని తెలిపారు.




బయ్యారంలో యూరియా పంపిణీని పరిశీలిస్తున్న విజయనిర్మల

ఫటాఫట్

సైబర్ నేరాల పట్ల అప్రమత్తంగా ఉండాలి

- గట్ల మహేందర్‌రెడ్డి, సీఐ, మహబూబాబాద్ టౌన్



ఆంధ్రజ్యోతి : సైబర్ నేరాల నియంత్రణకు ఏం చర్యలు తీసుకుంటున్నారు?

సీఐ : వాట్సాప్, ఇనిస్ట్రాగ్రామ్, ఫేస్‌బుక్‌లకు వచ్చే ఫేక్‌లింక్‌లను ఓపెన్ చేయొద్దు. ట్రేడింగ్ గేమ్స్‌లకు దూరంగా ఉండాలి. ఇతర రాష్ట్రాల నుంచి పోలీసుల పేరుతో డిజిటల్ అరెస్ట్ అంటూ ఫోన్ కాల్స్‌వస్తే 1930 టోల్ ఫ్రీ నెంబర్‌కు ఫిర్యాదు చేయాలి.

ఆంధ్రజ్యోతి : గంజాయి మత్తుకు అలవాటు పడే యువతకు మీరిచ్చే సందేశం ఏమిటీ?

సీఐ : మానుకోట పట్టణంలో గంజాయి, ఇతర మత్తు పదార్థాలు వాడే వారిని గుర్తించి, కుటుంబసభ్యుల సమక్షంలో కాలనీ పోలీసుల ద్వారా కౌన్సిలింగ్ ఇస్తున్నాం. మత్తు నుంచి విముక్తి చెందకుంటే కేసు నమోదు చేసి, కఠిన చర్యలు తీసుకుంటున్నాం. గంజాయి విక్రయాలపై ప్రత్యేక నిఘా పెట్టాం.

ఆంధ్రజ్యోతి : దొంగతనాల నివారణకు ఎలాంటి చర్యలు తీసుకుంటున్నారు?

సీఐ : కాలనీ పోలీసులతో నిరంతరం గస్తీ నిర్వహిస్తున్నాం. ప్రజలు ఊరు ప్రయాణాలు చేసేటప్పుడు విలువైన వస్తువులు ఇంట్లో ఉంచరాదు. కాలనీలు, ప్రధాన కాడలీలలో సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకోవాలి. అనుమానిత వ్యక్తులు కనిపిస్తే 100 కు కాల్ చేయాలి.

ఆంధ్రజ్యోతి : ట్రాఫిక్ ఉల్లంఘనపై తీసుకుంటున్న చర్యలు ఏమిటీ?

సీఐ : పట్టణంలో ట్రాఫిక్ నిబంధనలు ఉల్లంఘించే వాహనదారులపై జరిమానా విధిస్తూ, కఠినంగా వ్యవహరిస్తున్నాం. మద్యం సేవించినా, హెల్మెంట్ ధరించకపోయినా, బైక్‌పై ముగ్గురు ప్రయాణించినా జైలు శిక్ష తప్పదు.

- మహబూబాబాద్ క్రైం



యూరియా పంపిణీ కేంద్రాన్ని తనిఖీ చేస్తున్న జిల్లా అదనపు కలెక్టర్

రైతు క్లస్టర్ గ్రామాల వారీగా
యూరియా పంపిణీ చేయాలి
జిల్లా అదనపు కలెక్టర్ లెనిన్‌వత్సల్ టొప్పొ

మరిపెడ, సెప్టెంబరు 19 (ఆంధ్రజ్యోతి) : రైతు క్లస్టర్ గ్రామాల వారీగా యూరియా పంపిణీ జరగాలని జిల్లా అదనపు కలెక్టర్ లెనిన్ వత్సల్ టొప్పొ అధికారులకు సూచించారు. శుక్రవారం ఆయన మరిపెడ పీఏసీఎస్ యూరియా పంపిణీ కేంద్రాన్ని ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. పీఎస్‌గూడెం క్లస్టర్ రైతులకు యూరియా పంపిణీ చేస్తుండగా వేరే గ్రామాల రైతులు క్యూలైన్లో నిలుచుని ఉండగా ఆయన గుర్తించి అధికారులను మందలించారు. రైతులకు ముందస్తుగా అవగాహన కలిపించాలన్నారు. అనంతరం అదనపు కలెక్టర్ మరిపెడ మోడల్ స్కూల్‌ను సందర్శించారు. విద్యార్థులతో మాట్లాడి బోధన సామర్థ్యాలను అడిగి తెలుసుకున్నారు. ఆయన వెంట పీఏసీఎస్ చైర్మన్ చాపల యాదగిరిరెడ్డి, మరిపెడ తహసీల్దార్ కృష్ణవేణి, ఏవో వీరాసింగ్, ఆర్ఐ శరత్‌గౌడ్, మున్సిపల్ కమిషనర్ విజయానంద్ తదితరులు ఉన్నారు.

ఔషధ మొక్కలు మానవ మనుగడకు మేలు



మొక్కలను పరిశీలిస్తున్న అధికారులు, విద్యార్థులు

పెద్దవంగర, సెప్టెంబరు 19 (ఆంధ్రజ్యోతి): ఔషధ మొక్కలు మానవ మనుగడకు మేలు చేస్తాయని ఎంపీడీవో వేణుమాధవ్, ఎంఈవో బుధారపు శ్రీనివాస్, సీజీఆర్ ప్రతినిధి అన్నమయ్య అన్నారు. శుక్రవారం మండల కేంద్రంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో హైదరాబాద్‌కు చెందిన కౌన్సిల్ ఫర్ గ్రీన్ రెవల్యూషన్ సంస్థ వ్యవస్థాపకులు లీలా లక్ష్మారెడ్డి దంపతులు 100 ఔషధ మొక్కలు అందజేశారు. వీటితో పాఠశాలలో ఔషధ మొక్కల ఉద్యానవనాన్ని ఏర్పాటు చేశారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ కాలుష్యం పెరుగుతున్న తరుణంలో ఔషధ మొక్కలను పెంచి స్వచ్ఛమైన ఆరోగ్యాన్ని పొందవచ్చని సూచించారు. ఈకార్యక్రమంలో వందేమాతరం ఫౌండేషన్ ప్రతినిధి వెంకటేష్, సీజీఆర్ కో ఆర్డినేటర్ జీవన్, ఎర్తక్లబ్ ఇన్‌చార్జి శ్రీధర్, ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో సేవా కార్యక్రమాలు

తొర్రూరు, సెప్టెంబరు 19 (ఆంధ్రజ్యోతి): లయన్స్ క్లబ్ ఆఫ్ తొర్రూరు సూర్నపు రాంనర్సయ్య ఆధ్వర్యంలో శుక్రవారం పట్టణంలో పలు సేవా కార్యక్రమాలు చేపట్టారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ.. క్లబ్ డిస్టిక్ గవర్నర్ చంద్రశేఖర్ ఆర్య పుట్టిన రోజు సందర్భంగా తొర్రూరులో 500 మందికి అల్పాహారం, జీకే తండాలో విద్యార్థులకు వాటర్ బాటిల్‌లు, బ్యాగుల వితరణ, చీరల పంపిణీ, డయాబెటిక్ వైద్య శిబిరం, ఔతాపురం ప్రభుత్వ పాఠశాలలో 20వేల విలువ గల సౌండ్ సిస్టమ్, తదితర సేవా కార్యక్రమాలు చేపట్టినట్లు తెలిపారు. ఆయా ప్రభుత్వపాఠశాలల ప్రధానోపాధ్యాయులు, విద్యార్థులకు అవసరాలు ఉంటే గుర్తించి సమాచారం అందిస్తే తగిన సహకారం అందిస్తామన్నారు. రీజియన్ చైర్మన్ వెంకన్న, విశ్వేశ్వర రావు, రవీందర్ రెడ్డి, శ్రీనివాస్, నవీన్, పాల్గొన్నారు.

పరిసరాల పరిశుభ్రతతోనే ఆరోగ్యం

తొర్రూరురూరల్, సెప్టెంబరు19(ఆంధ్రజ్యోతి): పరిసరాల పరిశుభ్రతతోనే సంపూర్ణ ఆరోగ్యమని ఎంపీవో పూర్ణచందర్ అన్నారు. శుక్రవారం తొర్రూరు మండలం నాంచారిమదూరు జయంతి కాలనీ ప్రభుత్వ పాఠశాలలో స్వచ్ఛత-హీ సేవ కార్యక్రమంలో భాగంగా తడిపొడి చెత్తపై విద్యార్థులకు, మహిళ సంఘాలకు అవగాహన కల్పించి మాట్లాడారు. పాఠశాల ప్రధానోపాధ్యాయుడు రవీందర్, జీపీ కార్యదర్శి సతీష్, ఉపాధ్యాయులు, గ్రూప్ సభ్యులు, విద్యార్థులు పాల్గొన్నారు.

పీఏసీఎస్‌లో భారీ అవకతవకలు

● 89లక్షల పైగా బకాయిలు
● రికవరీలో పాలకవర్గం, అధికారుల నిర్లక్ష్యం

తొర్రూరు, సెప్టెంబరు 19 (ఆంధ్రజ్యోతి): తొర్రూరు ప్రైమరీ అగ్రికల్చర్ కోఆపరేటివ్ సొసైటీలో భారీ అవకతవకలు వెలుగు చూసిన నేపథ్యంలోనే చైర్మన్ కాకిరాల హరిప్రసాద్‌తో పాటు కమిటీ డైరెక్టర్లను తొలగించినట్లు జిల్లా సహకార సంఘం అధికారి సమర్పించిన నివేదికలో తేలింది. సొసైటీ పరిధిలో బకాయిలు రికవరీ చేయకపోవడం, కోట్ల రూపాయల రుణాల వసూళ్లలో నిర్లక్ష్యం, నాబార్డు మార్గదర్శకాలు ఉల్లంఘించి అధిక ఖర్చులు చేయడం, ఆడిట్ రిపోర్టులో చూపిన లోపాలు సరిచేసుకోకపోవడం, సొసైటీ సీఈవో వార్షిక బడ్జెట్‌ను సిద్ధం చేసి పంపడంలో తీవ్ర అలసత్వం వహించడంతో పాలకవర్గ లోపాలను గుర్తించి కమిటీ సభ్యులే డిఫాల్టర్‌లుగా ఉండటంతో సొసైటీలో ఎంత అవినీతి జరిగిందనేది బహిర్గతమైంది. ఈనెల 17న జిల్లాలో 5 ప్రాథమిక సొసైటీ పాలకవర్గాలను రద్దుచేస్తూ జిల్లా రిజిస్ట్రార్ ఉత్తర్వులు జారీ చేశారు. ఈపరిణామంలో ప్రతిపక్షాలు పాలకవర్గ నాయకత్వంలో సొసైటీ భ్రష్టుపట్టి పోయిందని, నిధులను కాజేశారని, ఆర్థిక అవకతవకలపై సొసైటీ ప్రతిష్ఠను దెబ్బతీశారని విమర్శిస్తున్నారు.

ప్రధాన లోపాలు

సొసైటీ పరిధిలో ఉన్న 89లక్షల బకాయిలను రికవరీ చేయకపోవడం, నాబార్డు మార్గదర్శకాలు ఉల్లంఘించి 30 శాతం మేర సాదర్ ఖర్చులు, సిబ్బంది వేతనాలు, ఇతర వృథా ఖర్చులు చేశారనే ఆరోపణలున్నాయి. సొసైటీ, డీసీసీ బ్యాంకు ద్వారా అందించిన రూ.8.39 కోట్ల రుణాలు పెద్దమొత్తంలో ఉన్నా వసూలు చేయడంలో విఫలమవడం, డిఫాల్టర్ల లిస్టు సిద్ధం చేయకపోవడం, రికవరీ చేసేందుకు ఎలాంటి ప్రణాళిక రూపొందించకపోవడం, 2021 నుంచి 2024 వరకు ఆడిట్ రిపోర్టులో గుర్తించిన లోపాలు సరిచేయకపోవడం లాంటి అనేక కారణాలు ఉన్నాయి. ప్రధానంగా నాబార్డు నిబంధన మేరకు ఖర్చు చేసిన వాటిలో సిబ్బంది ఇష్టారాజ్యంగా వ్యవహరించారనే ఆరోపణలు ఉన్నాయి. ధాన్యం తరలింపు, గన్నీ సంచుల కొనుగోళ్లు, డైరెక్టర్లు రుణాలు తీసుకుని చెల్లించకపోవడం, నిర్వహణ వ్యయం అధికంగా ఖర్చు చేయడం లాంటి లోపాలు గుర్తించి పాలక వర్గాన్ని రద్దు చేసినట్లు అధికారులు తెలుపుతున్నారు.

ప్రతిపక్ష నాయకులే చైర్మన్లుగా ఉండటమే కారణమా...?

జిల్లాలో రద్దైన 5సొసైటీల పాలకవర్గాలు బీఆర్ఎస్ నేతలు, చైర్మన్లు, డైరెక్టర్‌లుగా ఉండుటే అని జిల్లా ప్రజలు చర్చించుకుంటున్నారు. కేసముద్రం చైర్మన్ దీకొండ వెంకన్న, కురవి చైర్మన్ దొడ్డ గోవర్ధన్‌రెడ్డి, నెల్లికుదురు చైర్మన్ కాసం లక్ష్మారెడ్డి బీఆర్ఎస్ నాయకులు కావడంతో ఆసొసైటీలను నియోజకవర్గ ఎమ్మెల్యేల అనుమతితోనే సస్పెండ్ చేశారనే ఆరోపణలు ఉన్నాయి. తొర్రూరు సొసైటీ చైర్మన్ కాంగ్రెస్ పార్టీలోనే ఉన్నప్పటికీ ఇటీవల టీపీసీసీ ఉపాధ్యక్షురాలు ఝాన్సీరెడ్డితో విభేదాలు ఏర్పడటం, మార్కెట్ చైర్మన్ తిరుపతిరెడ్డి వర్గంతో చేతులు కలిపి అసమ్మతి స్వరం వినిపిస్తున్నారని, బయ్యారం చైర్మన్ మూల మధూకర్ రెడ్డి కాంగ్రెస్‌లో ఉన్నప్పటికీ అవినీతి ఆరోపణలు, అవకతవకలే రద్దుకు కారణం అని పేర్కొంటున్నారు. మెజారిటీ డైరెక్టర్లు బీఆర్ఎస్‌కు చెందిన వారే కావడం, స్థానిక ఎమ్మెల్యేలతో సఖ్యత లేకపోవడం వంటి కారణాలే పాలక మండలిల రద్దు అయినట్లు ప్రజలు చర్చించుకుంటున్నారు.



తొర్రూరు పీఏసీఎస్ కార్యాలయం

హాజరు అంతంతే

మరిపెడ బంగ్లాలోని ఎస్సీ హాస్టల్‌లో అవకతవకల ఆరోపణలు
వార్డెన్‌పై చర్యలు తీసుకోవాలంటున్న స్థానికులు



హాస్టల్ విద్యార్థులకు భోజనం వడ్డిస్తున్న సిబ్బంది

మరిపెడ, సెప్టెంబరు 19 (ఆంధ్రజ్యోతి): మరిపెడబంగ్లాలోని బాలుర ఎస్సీ హాస్టల్ అక్రమాలకు పుట్టాగా మారింది. హాస్టల్ వార్డెన్ స్థానికంగా ఉండరని స్థానికులు ఆరోపిస్తున్నారు. శుక్రవారం ఆంధ్రజ్యోతి హాస్టల్‌ను విజిట్ చేయగా హాస్టల్ స్థితిగతులు వెలుగులోకి వచ్చాయి. మరిపెడబంగ్లాలోని ఎస్సీ బాలుర హాస్టల్‌లో మొత్తం 60మంది విద్యార్థులు ఉండగా శుక్రవారం ఉదయం అల్పాహారం సమయానికి 15 మంది విద్యార్థులే కనిపించారు. ఎస్సీ బాలుర హాస్టల్‌లో ఎస్టీ విద్యార్థులే ఎక్కువగా ఉన్నారు. విద్యార్థులకు మెనూ ప్రకారం భోజనం పెట్టట్లేదని తెలిసింది. శుక్రవారం హాస్టల్ విద్యార్థులకు మెనూ ప్రకారం.. ఉదయం కిచిడి రసంతో పాటు అరటి పండు అందివ్వాల్సి ఉండగా సాధారణ భోజనం, టమాట, ఆలుగడ్డ కూరతోనే సరిపుచ్చారు. అరటిపండు సాయంత్రం ఇస్తామని అక్కడి వంటమనిషి తెలిపింది. హాస్టల్ వార్డెన్ పరకాల నుంచి అప్పుడప్పుడు వచ్చి పోతుంటాడని స్థానికులు అంటున్నారు. మొత్తం 60మంది విద్యార్థులకు 30మంది కూడా హాస్టల్‌లో ఉండరని స్థానికులు పేర్కొంటున్నారు. వార్డెన్ ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తుండడంతో విద్యార్థులు హాస్టల్‌కు రావట్లేదని స్థానికులు చెబుతున్నారు. అధికారులు హాస్టల్ వార్డెన్‌పై చర్యలు తీసుకోవాలని స్థానికులు డిమాండ్ చేస్తున్నారు. కాగా ఈ విషయంపై సదరు హాస్టల్ వార్డెన్‌ను వివరణ కోరగా 21నుంచి సెలవులు ఉన్నందున విద్యార్థులు ఇంటికి వెళ్లారన్నారు. నిత్యం హాస్టల్‌లోనే ఉంటున్నట్లు తెలిపారు.

హోరాహోరీగా ఎస్జీఎఫ్ క్రీడా పోటీలు

మరిపెడ, సెప్టెంబరు 19 (ఆంధ్రజ్యోతి) : ఎస్జీఎఫ్ క్రీడా మరిపెడ మండల స్థాయి క్రీడా పోటీలు శుక్రవారం మరిపెడ హైస్కూల్‌లో హోరాహోరీగా సాగాయి. ఈ పోటీలను ఎంఈవో అనిత, మరిపెడ హైస్కూల్ హెచ్ఎం అనంతరావు ప్రారంభించారు. కబడ్డీ, ఖోఖో, వాలీబాల్ పోటీలు ఉత్కంఠగా జరిగాయి. మొత్తం మండలంలోని 18 పాఠశాలల నుంచి విద్యార్థులు పాల్గొనగా జిల్లా స్థాయి పోటీలకు పలువురు విద్యార్థులు ఎంపికయ్యారు. క్రీడా నిర్వాహకులు రాజకుమారి, పీడీలు, పీఈటీలు, మరిపెడ స్కూల్ టీచర్లు పాల్గొన్నారు.

రెండు ద్విచక్రవాహనాలు ఢీ
నలుగురికి గాయాలు

తొర్రూరు రూరల్, సెప్టెంబరు19 (ఆంధ్రజ్యోతి): తొర్రూరు మండల కంఠాయపాలెం-గుర్తూర్ గ్రామాల మధ్య రెండు బైక్‌లు ఢీ కొని పలువురి గాయాలైన ఘటన శుక్రవారం చోటు చేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. కంఠాయపాలెంనకు చెందిన పల్లె వెంకన్న, రాంమూర్తి ద్విచక్రవాహనంపై గ్రామానికి వస్తుండగా వ్యవసాయ పనుల నిమిత్తం బైక్‌పై వెళ్తున్న మధుసూధన్ రెడ్డి, దిలీప్‌లు ఎదురెదురుగా ఢీ కొనడంతో వెంకన్న కాలు విరుగగా, ముగ్గురి స్వల్పగాయాలైనట్లు తెలిపారు. 108 సిబ్బంది ఈఎంటీ రఘు, పైలెట్ రమేష్‌లు ప్రథమ చికిత్స చేసి ఆస్పత్రికి తరలించారు.

టీయూఎఫ్ మండలాధ్యక్షుడిగా శ్రీనివాస్

మరిపెడ, సెప్టెంబరు 19 (ఆంధ్రజ్యోతి): మరిపెడ మండల తెలంగాణ ఉద్యమకారుల ఫోరం అధ్యక్షుడిగా మరిపెడ మున్సిపాలిటీకి చెందిన అల్వాల శ్రీనివాస్ ఎంపికయ్యారు. తనను గుర్తించి మరిపెడ మండల బాధ్యతలు అప్పగించిన రాష్ట్ర, జిల్లా కమిటీల బాధ్యులకు శ్రీనివాస్ ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.

విజయదశమికి ఇండ్లు పంపిణీ చేయాలి

డబుల్ బెడ్‌రూం ఇండ్ల వద్ద బతుకమ్మ ఆటలతో నిరసన



బతుకమ్మ ఆడుతూ నిరసన తెలుపుతున్న లబ్ధిదారులు

తొర్రూరు, సెప్టెంబరు 19 (ఆంధ్రజ్యోతి): తొర్రూరు పట్టణంలో నిర్మించి ఉన్న 270 డబుల్ బెడ్‌రూం ఇండ్లు అర్హులైన నిరుపేదలకు కేటాయించాలని కోరుతూ సీపీఎం పార్టీ నాయకుల ఆధ్వర్యంలో శుక్రవారం ఇండ్ల వద్ద నిరసన తెలిపారు. ఈసందర్భంగా సీపీఎం జిల్లా కమిటీ సభ్యుడు బొల్లం అశోక్, ఎండీ యాకూబ్ మాట్లాడుతూ.. నిర్మించి ఉన్న ఇండ్లు పంపిణీ చేయాలని 4నెలలుగా అధికారులు, ప్రజా ప్రతినిధుల చుట్టూ తిరుగుతున్నా పట్టించుకోవడం లేదన్నారు. పట్టణంలో అర్హులైన లబ్ధిదారులు వందల సంఖ్యలో ఉన్నారని, ప్రభుత్వం ఇండ్లు నిర్మిస్తామని హామీ ఇచ్చి ఇప్పటివరకు పట్టించుకోకపోవడం సరికాదన్నారు. ఇప్పటికైనా సంబంధిత ఉన్నతాధికారులు, ప్రజా ప్రతినిధులు స్పందించి అర్హులకు డబుల్ బెడ్‌రూం ఇండ్లు పంపిణీ చేయాలని, లేనట్లయితే లబ్ధిదారులు దసరా రోజు నిర్మించి ఉన్న ఇండ్లలో గృహప్రవేశం చేస్తారని హెచ్చరించారు. ఈకార్యక్రమంలో శ్రీను, మమత, శోభ, దర్గయ్య, యాకన్న, మంజుల, తదితరులు ఉన్నారు.

గంజాయి విక్రయిస్తున్న నలుగురి అరెస్ట్

● నిందితుల్లో ఒకరు బాలుడు



నిందితుల అరెస్ట్ చూపుతున్న డీఎస్పీ సూర్యనారాయణ, సీఐ, ఎస్సైలు

కాటారం, సెప్టెంబరు 19 (ఆంధ్రజ్యోతి): ఒడిషా రాష్ట్రంలోని మారుమూల మోటు ప్రాంతం నుంచి గంజాయి తెచ్చి స్థానికంగా విక్రయిస్తున్న ముగ్గురు యువకులతో పాటు ఓ బాలుడిని కొయ్యూరు పోలీసులు పట్టుకున్నారు. కాటారం డీఎస్పీ అమరగాని సూర్యనారాయణ తెలిపిన వివరాల ప్రకారం.. ముందస్తు సమాచారం అందుకున్న కొయ్యూరు ఎస్సై నరేష్ పోలీస్ సిబ్బందితో కలిసి మల్హర్‌రావు మండలం కొండంపేట గ్రామపంచాయతీ పరిధిలోని గట్టుపల్లిలో మూసేసిన ప్రభుత్వ పాఠశాల వద్ద మాటు వేశారు. ముందుగా ఓ బాలుడు, ఓ యువకుడు వచ్చి తర్వాత వచ్చిన మరో ఇద్దరు యువకులకు గంజాయి ప్యాకెట్లను అందజేస్తుండగా అదుపులోకి తీసుకున్నారు. వారి వద్ద 1 కిలో 230గ్రాముల ఎండు గంజాయితో పాటు సెల్‌ఫోన్‌ను స్వాధీనం చేసుకున్నారు. నిందితులు మల్హర్‌రావు మండలం కొండంపేట గ్రామానికి చెందిన కాంపల్లి సాయికుమార్, కొయ్యూరు గ్రామానికి చెందిన బాలుడు, మల్లారం గ్రామానికి చెందిన భూక్య రాజు, ఎండీ అజారొద్దీన్‌గా గుర్తించారు. బాలుడు విద్యార్థి కాగా మిగతా ముగ్గురు యువకులు కూలీ, ఎలక్ట్రీషియన్, వైన్ షాప్ వర్కర్‌గా పని చేస్తున్నారు. ఈ నలుగురిపై కొయ్యూరు ఎస్సై-2 రాజన్‌కుమార్ కేసు నమోదు చేసి రిమాండ్‌కు తరలించారు. కార్యక్రమంలో కాటారం సీఐ నాగార్జునరావు, కొయ్యూరు ఎస్సైలు నరేష్, రాజన్‌కుమార్ పాల్గొన్నారు.

దినసరి కార్మికుల రాస్తారోకో



రాస్తారోకో చేస్తున్న సీఐటీయూ నాయకులు, కార్మికులు

ఏటూరునాగారం రూరల్, సెప్టెంబరు 19 (ఆంధ్రజ్యోతి): గిరిజన సంక్షేమశాఖ పరిధిలోని ఆశ్రమ పాఠశాలలు, వసతిగృహాల్లో పనిచేస్తున్న దినసరి వేతన కార్మికులు తమ డిమాండ్లను పరిష్కరించాలని కోరుతూ సీఐటీయూ ఆధ్వర్యంలో ఐటీడీఏ కార్యాలయం ఎదుట 163వ జాతీయ రహదారిపై బైఠాయించి శుక్రవారం రాస్తారోకో నిర్వహించారు. ఈసందర్భంగా సీఐటీయూ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు ఎమ్డీ.దావూద్, రత్నం రాజేందర్‌లు మాట్లాడుతూ దినసరి వేతన కార్మికులతో ప్రభుత్వం వెంటనే చర్చలుజరపాలని, జీవో 63ను రద్దు చేయాలని డిమాండ్ చేశారు. కార్మికులు గత ఎనిమిదిరోజులుగా సమస్యలను పరిష్కరించాలని నిరవధిక సమ్మె చేస్తున్నా ప్రభుత్వం పట్టించుకోవడంలేదని అన్నారు. ప్రభుత్వం వెంటనే స్పందించి వారి న్యాయబద్ధమైన సమస్యలను పరిష్కరించాలన్నారు. అనంతరం పలు డిమాండ్లతో కూడిన వినతిపత్రాన్ని ఐటీడీఏ పీవో చిత్రమిశ్రాకు అందజేశారు. ఈ సందర్భంగా పీవో మాట్లాడుతూ కార్మికులు ఎదుర్కొంటున్న సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్తామని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో కార్మికులు నాగలక్ష్మి, జయలక్ష్మి, సుజాత, రాజు, కమల, భాగ్యలక్ష్మి, సమ్మక్క, సత్యవతి, విజయలక్ష్మి, రాఘవులు పాల్గొన్నారు.

పాపన్న కోటను పర్యాటక కేంద్రంగా తీర్చిదిద్దాలి

● పర్యాటకశాఖ మంత్రి జూపల్లి కృష్ణారావుకు వినతి



మంత్రి జూపల్లికి వినతిపత్రం అందిస్తున్న మాజీ వైస్ ఎంపీపీ సుధీర్ రెడ్డి

స్టేషన్‌ఘన్‌పూర్, సెప్టెంబరు 19 (ఆంధ్రజ్యోతి): మండలంలోని తాటికొండ గ్రామంలోని సర్దార్ సర్వాయి పాపన్న కోటను పర్యాటక కేంద్రంగా తీర్చిదిద్దాలని స్టేషన్‌ఘన్‌పూర్ మాజీ వైస్ ఎంపీపీ చల్లా సుధీర్ రెడ్డి, తాటికొండ గ్రామ మాజీ సర్పంచ్ చల్లా ఉమాదేవిలు శుక్రవారం పర్యాటకశాఖ మంత్రి జూపల్లి కృష్ణారావును కోరారు. శుక్రవారం హైదరాబాద్‌లో మంత్రి కార్యాలయంలో మర్యాద పూర్వకంగా కలిసి వినతిపత్రం అందించారు. సుధీర్ మాట్లాడుతూ ఘన చరిత్ర కలిగిన తాటికొండ కోటలోని బురుజులు, భారీ పరిమాణంలో ఉన్న పాటిమన్ను గోడలు, శిథిలావస్థలకు చేరుకుంటున్నాయని, వాటి పరిరక్షణకు సహకరించాలని కోరారు. కోటపైన ఉన్న పాపన్న సామ్రాజ్యంకు సంబంధించిన కట్టడాలను ప్రజలు వెళ్లి చూసేలా కోట పైకి మెట్లను ఏర్పాటు చేయాలన్నారు. కోట వద్ద నుంచి మల్లన్నగండి రిజర్వాయర్ వరకు పర్యాటక కేంద్రంగా తీర్చిదిద్దాలని మంత్రిని కోరినట్లు తెలిపారు. మంత్రి సానుకూలంగా స్పందించినట్లు పేర్కొన్నారు. మంత్రిని కలిసిన వారిలో వ్యవసాయశాఖ కమిషన్ సభ్యురాలు ఎం. భవాని రెడ్డి, చల్లా ఇంద్రజిత్ రెడ్డి ఉన్నారు.

మళ్లీ పెరిగిన గోదావరి వరద

మహదేవపూర్, సెప్టెంబరు 19(ఆంధ్రజ్యోతి): మహదేవపూర్ మండలం కాళేశ్వరం త్రివేణి సంగమం వద్ద శుక్రవారం గోదావరి వరద పెరిగింది. మహ రాష్ట్రలో వర్షాలు కురవడం, ప్రాణహిత ద్వారా వరద రావడంతో త్రివేణి సంగమం వద్ద గోదావరి శుక్రవారం 10. 87 మీటర్ల ఎత్తుతో ప్రవహిస్తున్నట్లు అధికారులు తెలిపారు. కాగా రెండు మూడురోజుల నుంచి గోదావరి పెరుగుతూ తగ్గుతూ ప్రవహిస్తోంది. పశువుల కాపరులు, రైతులు గోదావరి వరద వల్ల అప్రమత్తంగా ఉండాలని అధికారులు తెలిపారు.

మేడిగడ్డ బ్యారేజీలోకి 6.50లక్షల క్యూసెక్కుల ఇన్‌ఫ్లో

మహదేవపూర్ రూరల్, సెప్టెంబరు 19(ఆంధ్రజ్యోతి) : జయశంకర్ భూపాలపల్లి జిల్లా మహదేవపూర్ మండలంలో నిర్మించిన మేడిగడ్డ బ్యారేజీకి వరద ప్రవాహం కొనసాగుతోంది. బ్యారేజీలోకి 6.50లక్షల క్యూసెక్కుల ఇన్‌ఫ్లో వస్తుండగా 85గేట్లను ఎత్తి అంతే నీటిని దిగువకు పంపిస్తున్నారు. కాగా బ్యారేజీ వద్ద నీటి మట్టం 7.20మీటర్లు ఎత్తులో ప్రవహిస్తోంది.

సప్లిమెంటరీ పరీక్షలను పకడ్బందీగా నిర్వహించాలి

ములుగు కలెక్టరేట్, సెప్టెంబరు 19 (ఆంధ్రజ్యోతి): ఈ నెల 22 నుంచి 28వతేదీ వరకు జరిగే ఓపెన్ టెన్త్, ఇంటర్ సప్లిమెంటరీ పరీక్షలను పకడ్బందీగా నిర్వహిం చాలని ములుగు అదనపు కలెక్టర్ సీహెచ్.మహేందర్‌జీ అధికారులను ఆదేశించారు. శుక్రవారం తన చాంబర్‌లో ఆయన సంబంధిత అధికారులతో పరీక్షల నిర్వహణపై గూగుల్‌మీట్ ద్వారా సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా మహేందర్‌జీ మాట్లాడుతూ జిల్లాకేంద్రంలోని బండారుపల్లి మోడల్‌స్కూల్‌లో పరీక్ష కేంద్రం ఏర్పాటు చేయడం జరిగిందని, పదోతరగతి సెంటర్‌లో 60 మంది, ఇంటర్మీడియట్ సెంటర్‌లో 106మంది అభ్యర్థులు పరీక్షలు రాయనున్నారని అన్నారు. ఈ పరీక్షలు ఉదయం 9.30గంటల నుంచి మధ్యాహ్నం 12గంటల వరకు, మధ్యాహ్నం 2.30గంటల నుంచి సాయంత్రం 5గంటల వరకు జరుగుతాయని, పరీక్ష కేంద్రం వద్ద తాగునీరు, మరుగు దొడ్లు, విద్యుత్ సదుపాయం ఏర్పాటు చేయాలన్నారు. అభ్యర్థులను పరీక్షకేంద్రానికి చేరవేసేందుకు ఆర్టీసీ బస్సులను సిద్ధంగా ఉంచాలని, ఉదయం 9గంటలలోపు అభ్యర్థులు పరీక్ష కేంద్రానికి చేరుకోవాలన్నారు. అభ్యర్థులు హాల్‌టికెట్లను ఆన్‌లైన్‌లో డౌన్‌లోడ్ చేసుకోవాలని సూచించారు. పరీక్షలు పూర్తయ్యేవరకు బందోబస్తు ఏర్పాటు చేయాలని పోలీస్ అధికారులను ఆదేశించారు. పరీక్ష కేంద్రాల వద్ద ఆశా వర్కర్లు, ఏఎన్ఎంలు మెడికల్ కిట్లతో అందుబాటులో ఉండి వైద్యసేవలందించాలని సూచించారు. సమావేశంలో డీఈవో సిద్ధార్థరెడ్డి, సంబంధిత శాఖల అధికారులు జయదేవ్, సురేష్, తదితరులు పాల్గొన్నారు.

పొన్నాలను కలిసిన నాయకులు



మాజీ మంత్రి పొన్నాల లక్ష్మయ్యతో బీఆర్ఎస్ నాయకులు

జనగామ రూరల్, సెప్టెంబరు 19 (ఆంధ్రజ్యోతి): మాజీ మంత్రి, బీఆర్ఎస్ రాష్ట్ర నాయకుడు పొన్నాల లక్ష్మయ్యను జనగామ బీఆర్ఎస్ నాయకులు శుక్రవారం మర్యాదపూర్వకంగా కలిశారు. అమెరికా పర్యటన ముగించుకొని హైదరాబాద్‌కు వచ్చిన పొన్నాలను మాజీ మునిసిపల్ కౌన్సిలర్ ధర్మపురి శ్రీనివాస్, నాయకులు ఎండీ మాజీద్, బుర్ర శ్రీనివాస్ గౌడ్, బుడిగె గురువయ్య గౌడ్, నాగమల్ల శ్రీనివాస్, సౌడ మహేశ్, తుంగ సతీశ్‌లు మర్యాద పూర్వకంగా కలిసి సత్కరించారు.

బతుకమ్మకు ముమ్మర ఏర్పాట్లు: డీపీవో

పాలకుర్తి, సెప్టెంబరు 19(ఆంధ్రజ్యోతి): ఈనెల 21న బతుకమ్మ పండుగను పురస్కరించుకొని మండల కేంద్రంలో ఊర చెరువు వద్ద బతుకమ్మలు నిర్వహించే స్థలాన్ని శుక్రవారం జిల్లా పంచాయతీ అధికారి ఎన్.స్వరూప పరిశీలించారు. ఆమె మాట్లాడుతూ ఎంగిలి పూల బతుకమ్మ నుంచి సద్దుల బతుకమ్మ వరకు మహిళలు అత్యంత వైభవంగా నిర్వహించే బతుకమ్మ పండుగ కోసం ఏర్పాట్లు సిద్ధం చేస్తున్నట్లు తెలిపారు. రిజర్వాయర్ పనులు జరుగుతున్న నేపథ్యంలో చెరువు బండల పైనే మహిళలు ఆట, పాటలతో బతుకమ్మలను నిర్వహించేలా ఏర్పాట్లు చేస్తున్నట్లు తెలిపారు. బతుకమ్మలను నిమజ్జనం చేసేందుకు నీటి నిల్వలున్న ప్రదేశాన్ని కూడా పరిశీలించినట్లు తెలిపారు. ఆమె వెంట పాలకుర్తి జీపీ కార్యదర్శి కపిలవాయి వెంకటేశ్వరచారి, సిబ్బంది ఉన్నారు.

ఇసుక ట్రాక్టర్లు, డోజర్ల స్వాధీనం

కాటారం, సెప్టెంబరు 19(ఆంధ్రజ్యోతి): కాటారం మండలంలోని విలాసాగర్ మానేరు నది నుంచి అక్రమంగా ఇసుకను తరలిస్తున్న నాలుగు ట్రాక్టర్లు, ఎనిమిది డోజర్లను పోలీసులు పట్టుకున్నారు. మానేరు నదిలో అనుమతులు లేకుండా డోజర్ల ద్వారా ఇసుకను తోడి ట్రాక్టర్ల ద్వారా తరలిస్తుండగా బయ్యారం క్రాస్ సమీపంలో సీజ్‌చేసి పోలీస్‌స్టేషన్‌కు తరలించామని, ఓనర్లు, డ్రైవర్లపై కేసు నమోదు చేశామని ఎస్సై శ్రీనివాస్ తెలిపారు.

కాశిబుగ్గ దసరాతో కొత్త చిక్కు



ఉత్సవాలు జరిగేది వర్ధన్నపేట నియోజకవర్గంలో..

- ముఖ్య అతిథులుగా హాజరయ్యేది కొండా దంపతులు
- మావాళ్ల పరిస్థితేమిటంటున్న స్థానికులు

వరంగల్ సిటీ, సెప్టెంబరు 19 (ఆంధ్రజ్యోతి): మంత్రి కొండా సురేఖ దంపతులకు దసరా ఉత్సవాల చిక్కు రానున్నదా? ఈ చర్చ ఇప్పుడు కాశిబుగ్గలో జోరుగా సాగుతోంది. కాశిబుగ్గ దసరా ఉత్సవ సమితి గత 30 ఏళ్లగా ఏటా దసరా ఉత్సవాలను వైభవంగా నిర్వహిస్తోంది. మొదట్లో ఉత్సవాలను ప్రస్తుత ఓసిటీ శ్రీసీతారామాంజనేయస్వామి దేవాలయం ఎదుట నిర్వహించేవారు. తరువాత ఓ సిటీ స్టేడియంలో కొన్ని సంవత్సరాలు నిర్వహించారు. గత రెండేళ్లుగా చిన్న వడ్డేపల్లి చెరువు సమీపంలో నిర్వహిస్తున్నారు. అయితే చిన్న వడ్డేపల్లి చెరువు ప్రాంతం 14వ డివిజన్ వర్ధన్నపేట నియోజకవర్గం కిందకు వస్తుంది. దసరా ఉత్సవాలు నిర్వహించే వారు వరంగల్ తూర్పు నియోజకవర్గానికి చెందిన వారు కావడంతో తూర్పు ప్రజాప్రతినిధులను అతిథులుగా పిలవడం ఆనవాయితీగా పెట్టుకున్నారు. ఈ క్రమంలో ఈ సారి ముఖ్య అతిథులుగా మంత్రి కొండా సురేఖ, మాజీ ఎమ్మెల్సీ కొండా మురళీధర్‌రావు ఆహ్వానించనున్నారు. ఇక్కడ అసలు చిక్కు వస్తోంది. ఉత్సవ స్థలం (14వ డివిజన్) వర్ధన్నపేట నియోజకవర్గ పరిధిలోకి వస్తున్నందున 'మా ఎమ్మెల్యేను ముఖ్య అతిథిగా పిలుచుకుని మేమే దసరా ఉత్సవాలను ఘనంగా నిర్వహిస్తాం" అని ఆ డివిజన్ నాయకులు అంటున్నారు. తమ ప్రాధాన్యత లేకుండా ఉత్సవాలు ఎలా నిర్వహిస్తారని ప్రశ్నిస్తున్నారు. ఈ వివాదం ఇలాగే కొనసాగితే కొండా దంపతులు మరో వివాదంలో చిక్కుకునే ప్రమాదం ఉందని కొండా అభిమానులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

పరిధి దాటితే ప్రమాదమేనా..?

కొద్ది నెలలుగా మంత్రి కొండా సురేఖ దంపతులకు.. ఇతర ఎమ్మెల్యేలకు మధ్య వివాదాలు కొనసాగుతున్నాయి. ఇటీవల పశ్చిమ ఎమ్మెల్యే నాయిని రాజేందర్‌రెడ్డి తన నియోజకరవర్గంలో తనకు తెలియకుండా ధర్మకర్తలను ఎలా నియమిస్తారని మంత్రి సురేఖను ప్రశ్నించిన విషయం తెలిసిందే.. దీంతో ఒకరి నియోజకవర్గం పరిధిలో మరొకరు జోక్యం చేసుకోవద్దని అధిష్టానం కండీషన్ పెట్టింది. ఈ నేపథ్యంలో వర్ధన్నపేట నియోజకవర్గం పరిధిలో జరిగే ఉత్సవాలకు ముఖ్య అతిథులుగా మంత్రి సురేఖ, మురళీధర్‌రావు వెళితే.. స్థానిక ఎమ్మెల్యే కెఆర్ నాగరాజు , స్థానిక ప్రజాప్రతినిధులు మంత్రిని ప్రశ్నించే అవకాశం ఉంటుందని స్థానికులంటున్నారు. కాశిబుగ్గ దసరా ఉత్సవ సమితి నాయకులు ఈ విషయం తెలిసి చేస్తున్నారా..? తెలియక చేస్తున్నారా.. అని స్థానికంగా చర్చ జరుగుతోంది. ఇలాంటి సమస్యలు తలెత్తకుండా ఉండాలంటే ముందుగా ఏనుమాముల ప్రాంత నాయకులతో, వర్ధన్నపేట శాసన సభ్యుడితో మాట్లాడాలని స్థానికులు అభిప్రాయపడుతున్నారు. తమ ప్రాంతంలో ఉత్సవాలు నిర్వహిస్తూ కాశిబుగ్గ దసరా ఉత్సవ సమితి నాయకులు తమకు ప్రాధాన్యం ఇవ్వకుండా పెత్తనం చేస్తున్నారని ఏనుమాముల వాసులు అభ్యంతరం వ్యక్తం చేస్తున్నారు. రెండు సంవత్సరాలుగా స్థానిక కార్పొరేటర్‌కు సైతం గౌరవం ఇవ్వడం లేదని మండిపడుతున్నారు. స్థానిక నాయకులను, ప్రజా ప్రతినిధులను భాగస్వాములుగా చేస్తూ కార్యక్రమాలను నిర్వహిస్తే బాగుంటుందని అభిప్రాయ పడుతున్నారు.

ముల్కనూర్ సభ్యులకు దసరా బోనస్



సభకు హాజరైన రైతులు



సమావేశంలో మాట్లాడుతున్న బ్యాంకు అధ్యక్షుడు ప్రవీణ్‌రెడ్డి

- రూ.3.70కోట్లు ప్రకటించిన అధ్యక్షుడు ప్రవీణ్‌రెడ్డి
- రూ.410కోట్లతో బ్యాంకు టర్నోవర్, రూ.13కోట్ల రాయితీలు
- ముల్కనూరు బ్యాంకు వార్షిక మహాసభలో నిర్ణయాలు

భీమదేవరపల్లి, సెప్టెంబరు 19 (ఆంధ్రజ్యోతి): ముల్కనూర్ సహకార బ్యాంకు సభ్యులకు రూ.3.70కోట్లు దసరా పండుగ సందర్భంగా రైతులకు బోనస్ అందజేస్తున్నామని బ్యాంకు అధ్యక్షుడు అల్గిరెడ్డి ప్రవీణ్‌రెడ్డి వెల్లడించారు. అలాగే, వివిధ పథకాల కింద ఈయేడు రూ.13 కోట్ల రాయితీలను అందజేసినట్లు తెలిపారు. శుక్రవారం మండలంలోని ముల్కనూర్ బ్యాంకులోని జిన్నింగ్ మిల్లు ఆవరణలో 69వ వార్షిక మహాసభ బ్యాంకు అధ్యక్షుడు ప్రవీణ్‌రెడ్డి అధ్యక్షతన నిర్వహించారు. ముందుగా వ్యవస్థాపక అధ్యక్షుడు అల్గిరెడ్డి కాశివిశ్వనాథరెడ్డి విగ్రహానికి, చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా బ్యాంకు 69వ వార్షిక నివేదిక లోన్ మేనేజర్ రాజమౌళి సభకు వివరించారు. అనంతరం బ్యాంకు అధ్యక్షుడు ప్రవీణ్‌రెడ్డి మాట్లాడుతూ.. ముల్కనూర్ సహకార బ్యాంకులో 2025లో ధాన్యం సేకరణ, బియ్యం అమ్మకాలు, వరిసీడ్ విత్తనాల అమ్మకాలు, పత్తి కొనుగోళ్లు తదితర అంశాల్లో రూ.410 కోట్ల వ్యాపారం నిర్వహించామన్నారు. ఇందులో రూ.7.08కోట్ల లాభాలు వచ్చాయన్నారు. సన్నరకాలు పండించిన రైతులకు క్వింటాల్‌కు రూ.200, పత్తికి క్వింటాల్‌కు రూ.300, సీడ్‌కు క్వింటాల్‌కు రూ.125, దొడ్డు రకం వడ్లకు రూ.100 చొప్పున బోనస్‌ను రైతులకు అందిస్తామన్నారు. బ్యాంకులోని 163 మంది సభ్యులు చనిపోతే పంట మాఫీ పథకం కింద రూ.1.20కోట్లు మాఫీ చేశామన్నారు. దహన సంస్కారాల కోసం రూ.33లక్షలు, విద్యార్థులకు స్కాలర్‌షిప్‌లు రూ.20లక్షలు, వృద్ధాప్య పింఛన్ రూ.77లక్షలు, కళ్ల ఆపరేషన్ కోసం రూ.10లక్షలు అందించామన్నారు. కిందటేడు వాటాధనం నుంచి 15 శాతంలాభాలు రూ.3కోట్లు అందించామన్నారు. రైతులకు ఖరీఫ్, రబీ సీజన్‌లో రూ.246కోట్ల రుణాలు అందించామన్నారు.సమావేశానికి 5600 మంది రైతులు హాజరయ్యారు. మధ్యకాలిక, దీర్ఘకాలిక అప్పులు రూ.10కోట్ల రుణాలు రైతులకు అందించామన్నారు. ఇలా పలు సంక్షేమ పథకాలతో రైతులకు రూ.13కోట్ల రాయితీలు అందించామన్నారు. ఈ యేడు కొత్తగా జగన్నాథపూర్, రత్నగిరి గ్రామాల్లో గోదాముల నిర్మాణాలను చేపడుతున్నామన్నారు. అలాగే బ్యాంకులో పనిచేసే ఉద్యోగులకు, సందర్శకుల కోసం డైనింగ్ హాల్‌ను నిర్మిస్తామన్నారు. బ్యాంకులో అగ్రికల్చర్ యూనివర్సిటీ ఏర్పాటు చేయాలని రంగయ్యపల్లి గ్రామానికి చెందిన తిరుపతిరెడ్డి అనే రైతు కోరారు.

ఈ సమావేశంలో బ్యాంకు జనరల్ మేనేజర్ మార్పాటి రాంరెడ్డి, అసిస్టెంట్ జనరల్ మేనేజర్ సతీష్, వెంకటేశ్వర్‌రావు, బ్యాంకు ఉపాధ్యక్షుడు గజ్జి వీరయ్య, డైరెక్టర్లు కాశిరెడ్డి వసంత, కంది రవీందర్‌రెడ్డి, అంబాల రాములు, ఈర్ల మూగయ్య, బేల కనుకమ్మ, బొల్లంపల్లి కుమారస్వామి, మండ శ్రీనివాస్, వీరారెడ్డి, మహేందర్, గణవేణ శ్రీనివాస్, గుగ్లోతు బాషు, చెవ్వాల బుచ్చయ్య, గుర్రాల భాస్కర్‌రెడ్డితో పాటు బ్యాంకు రైతులు పాల్గొన్నారు.

నిశ్చితార్థం ఒకరితో.. పెళ్లి మరొకరితో..

- రెడ్డికాలనీలో ఓ యువకుడి నిర్వాకం
- నిందితుడి ఇంటి ఎదుట బాధితురాలి ఆందోళన

వరంగల్ క్రైం, సెప్టెంబరు 19 (ఆంధ్రజ్యోతి): నిశ్చితార్థం తనతో చేసుకుని.. వివాహం మరొక యువతితో చేసుకోబోతున్నాడని గ్రహించిన ఖమ్మం మోతీనగర్‌కు చెందిన యువతి.. కుటుంబ సభ్యులతో కలిసి శుక్రవారం హనుమకొండ రెడ్డికాలనీలోని యువకుడి ఇంటి ఎదుట ఆందోళన నిర్వహించింది. విషయం తెలుసుకున్న హనుమకొండ పోలీసులు ఇరువర్గాలను పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. ఎస్‌ఐ కిశోర్ కుమార్ కథనం ప్రకారం.. హనుమకొండ రెడ్డికాలనీకి చెందిన ఎలపోతల లింగయ్య కుమారుడు సుమన్ కిందటేడు మార్చిలో ఖమ్మంకు చెందిన యువతితో నిశ్చితార్థం చేసుకున్నాడు. ఈ సందర్భంగా రూ.15లక్షల కట్నం ఇచ్చేందుకు యువతి తల్లిదండ్రులు ఒప్పుకున్నారు.

కాగా, అప్పటికే వరంగల్ కొత్తవాడకు చెందిన మరో యువతితో ప్రేమలో ఉన్న సుమన్.. ఎంగేజ్‌మెంట్ చేసుకున్న అమ్మాయిని దూరం పెడుతూ వచ్చారు. మీ కుటుంబ మర్యాదలు బాగలేవని, నిన్ను చేసుకోనని అంటూ వస్తున్నాడు. ఎంగేజ్‌మెంట్ అయ్యాక పెళ్లి ఎలా రద్దు చేస్తామని అమ్మాయి తరఫున బంధువులు ప్రశ్నించారు. ఈ క్రమంలోనే ఈ యేడు తాను ప్రేమించిన అమ్మాయిని సుమన్ వివాహం చేసుకున్నాడు. ఫేస్‌బుక్‌లో సుమన్ ఓ అమ్మాయితో చనువుగా ఉన్న ఫొటోను గమనించిన ఖమ్మంకు చెందిన యువతి.. శుక్రవారం విషయం తెలుసుకునేందుకు రెడ్డికాలనీకి రాగా, సుమన్ మరో యువతిని వివాహం చేసుకున్నట్లుగా తెలిసింది. వెంటనే తన వెంట వచ్చిన కుటుంబ సభ్యులు, బంధువులతో కలిసి యువకుడి ఇంటి ఎదుట ఆందోళనకు దిగింది. విషయం తెలుసుకున్న హనుమకొండ పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని ఇరువర్గాలను అదుపులోకి తీసుకుని స్టేషన్‌కు తరలించారు. ఎంగేజ్‌మెంట్ సమయంలో ఒప్పుకున్న రూ.15లక్షల కట్నంలో రూ.6లక్షల నగదు రూపంలో, రూ.రెండున్నర లక్షలు గూగుల్‌పే ద్వారా ఇచ్చినట్లుగా అమ్మాయి కుటుంబ సభ్యులు తెలుపుతుండగా రూ.రెండున్నర లక్షలు మాత్రమే ఇచ్చారని అబ్బాయి తల్లిదండ్రులు చెబుతున్నారని ఎస్‌ఐ తెలిపారు. కాగా, ఈ విషయంపై ఎలాంటి ఫిర్యాదు చేయలేదని, ఖమ్మంలోనే ఫిర్యాదు చేస్తామని అమ్మాయి తరఫు బంధువులు వెళ్లిపోయినట్లు ఎస్సై తెలిపారు.



రెడ్డికాలనీలో రోడ్డుపై ఆందోళన చేస్తున్న యువతి కుటుంబ సభ్యులు

బస్సు ఆపలేదని డ్రైవర్‌పై దాడి

ఇద్దరిపై కేసు నమోదు

కేసముద్రం, సెప్టెంబరు 19 (ఆంధ్రజ్యోతి) : బస్సు ఆపలేదని ఆర్‌టీసీ డ్రైవర్‌పై ఇద్దరు వ్యక్తులు దాడి చేసిన ఘటన కేసముద్రం స్టేషన్‌లో శుక్రవారం సాయంత్రం చోటు చేసుకుంది. ఎస్‌ఐ మురళీధర్‌రాజ్ తెలిపిన ప్రకారం మహబూబాబాద్ నుంచి వరంగల్ వెళుతున్న ఆర్‌టీసీ బస్సును డ్రైవర్ టి.విష్ణుమూర్తి ధన్నసరి క్రాస్ రోడ్డు వద్ద ప్రయాణికులు దిగేందుకు నిలిపాడు. ఆ తర్వాత బడితండా వద్ద బస్సు ఆపాలని అక్కడ ఓ మహిళ చేయి పెట్టి ఆపగా అప్పటికే 92 మంది ప్రయాణికులతో కిక్కిరిసి ఉండడంతో వెనుక వచ్చే బస్సులో రావాలని సూచించి, ఆ బస్సును ఆపలేదు. నేరుగా గాంధీసెంటర్‌కు వచ్చి ప్రయాణికులు దిగేందుకు బస్సును డ్రైవర్ ఆపాడు. సదరు మహిళను బడితండాకు చెందిన భిక్షపతి బైక్‌పై గాంధీసెంటర్‌లో ఉన్న బస్సు వద్దకు తీసుకువచ్చి డ్రైవర్‌తో వాగ్వావాదానికి దిగాడు.

బస్సు ఎందుకు ఆపలేదని వాదనకు దిగగా, అదే సెంటర్లో టీస్టాల్ నిర్వహించే మహేందర్ వచ్చి డ్రైవర్‌ను దూషిస్తూ కొట్టాడు. దీంతో డ్రైవర్ స్థానిక పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేయడంతో ఇద్దరిపై కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ తెలిపారు. ఈ సందర్భంగా బస్సును డ్రైవర్ పోలీస్‌స్టేషన్ వద్ద నిలపడంతో ప్రయాణికులు వెనుక వచ్చే మరో బస్సులో వెళ్లిపోయారు.



కేసముద్రం పోలీస్‌స్టేషన్ వద్ద నిలిచిన ఆర్‌టీసీ బస్సు

టీఎస్‌ఆర్‌జేసీలో సూసైడ్ నోట్ కలకలం

హసన్‌పర్తి, సెప్టెంబరు 19 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని ఎర్రగట్టు గుట్ట క్రాస్‌రోడ్డులోని తెలంగాణ బాలికల గురుకుల కళాశాలలో ఓ విద్యార్థిని 'సూసైడ్ నోట్' కలకలం రేపుతోంది. కళాశాలలో నలుగురు విద్యార్థినులు మూడు రోజుల కిందట సూసైడ్ చేసుకునేందుకు నిర్ణయించుకున్నారని, వీరిలో ఒకరు సూసైడ్ నోట్ రాసినట్టు ప్రచారం జరుగుతోంది. ఈ విషయం కళాశాల సిబ్బందికి తెలియడంతో విద్యార్థినిలకు కౌన్సిలింగ్ చేశారని తెలిసింది. అయితే విద్యార్థినిలు ఎందుకు ఆత్మహత్య చేసుకోవాలనుకున్నారు..? అనేది తెలియరావడం లేదు. కళాశాలలోని ఇద్దరు సిబ్బంది వ్యవహరించిన తీరుతోనే విద్యార్థినిలు మనస్థాపానికి లోనై ఆత్మహత్యకు సిద్ధపడినట్టు ప్రచారం జరుగుతోంది. ఈ విషయమై ప్రధానోపాధ్యాయురాలు ఇందుమతిని వివరణ కోరగా ఓ విద్యార్థిని సూసైడ్ నోట్ రాసుకున్నది నిజమేనని, అయితే ప్రస్తుతం సమస్య సద్దుమణిగిందని చెప్పారు.



నెక్కొండ మండలం అప్పల్‌రావుపేటలో జరిగిన రోడ్డు ప్రమాదంలో మృతి చెందిన అన్న గాయపడిన తమ్ముడు



దాన్య (ఫైల్)

అంత్యక్రియలకు వెళ్లొస్తూ.. అనంతలోకాలకి..

- ఎదురుగా వస్తున్న ఆటోను తప్పించబోయి
- లారీ కింద పడిన ద్విచక్రవాహనం
- తమ్ముడి కళ్లెదుటే అన్న మృతి
- ప్రమాదంలో గాయపడ్డ తమ్ముడు

నెక్కొండ, సెప్టెంబరు 19 (ఆంధ్రజ్యోతి) : సమీప బంధువు అంత్యక్రియలకు వెళ్లివస్తుండగా జరిగిన రోడ్డు ప్రమాదంలో అన్న మృతి చెందగా తమ్ముడు గాయపడిన ఘటన నెక్కొండ మండలం అప్పల్‌రావుపేట గ్రామ సమీపంలో శుక్రవారం రాత్రి జరిగింది. ఈ ప్రమాదంలో ఖానాపురం మండలం మంగళవారిపేట గ్రామశివారు బోటిమీది తండాకు చెందిన రైతు గుగులోతు దాన్య (47) తలకు బలమైన గాయాలై అక్కడికక్కడే మృతి చెందాడు.

స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. నెక్కొండ మండలం బొల్లికొండ గ్రామంలో దగ్గరి బంధువు దారవత్ సరీరాం అనారోగ్యంతో మృతి చెందగా శుక్రవారం అంత్యక్రియలకు హాజరైన దాన్య అతని తమ్ముడు ఈర్యతో కలసి ద్విచక్ర వాహనంపై నెక్కొండకు వైపు వస్తున్నాడు. ఈ క్రమంలో ఇదే రోడ్డులో ముందు వెళ్తున్న లారీని ఓవర్‌టేక్ చెస్తుండగా ఎదురుగా ఆటో రావడంతో ఆటోను తప్పించే క్రమంలో లారీ కింద పడ్డారు. దాన్య తలపగలడంతో అక్కడికక్కడే మృతి చెందగా, ఈర్య కాలు వీరగడంతో పాటు తీవ్ర గాయాలపాలయ్యాడు. తన కళ్లెదుటే అన్న మృతి చెందడాన్ని తట్టుకోలేక ఈర్య విలపించిన తీరు పలువురిని కంటతడి పెట్టించింది. ఘటన స్థలం నుంచి లారీ ఆపకుండా వెళ్లిపోవడంతో లారీ కోసం పోలీసులు గాలిస్తున్నారు.

ప్రమాద విషయమై ఆటో డ్రైవర్‌ను పోలీసులు ప్రశ్నించడానికి ప్రయత్నించగా ఆటో డ్రైవర్‌కూడా పరారీలో ఉండటంతో డ్రైవర్ ఆచూకీ కోసం పోలీసులు వెతుకుతున్నారు. ఈ ప్రమాదంలో ఆటోలోని ప్రయాణికులకు కూడా స్వల్పగాయాలైనట్లు తెలిసింది. సంఘటన స్థలానికి చెరుకున్న ఎస్సై మహేందర్ మృతదేహాన్ని పోస్టుమార్టంనకు, గాయపడిన ఈర్యను ఆసుపత్రికి తరలించారు. మృతుడికి భార్య విజయ, కూతురు ఉన్నారు.



ఐపీపీఆర్ఎస్ సెంటర్ల మూసివేత

- హనుమకొండ, భూపాలపల్లి పోస్టాఫీసుల్లో నిలిచిన రైల్వే రిజర్వేషన్లు
- రిజర్వేషన్లు జరగటం లేదన్న కారణంతో మూసివేత
- ఎంపీ డాక్టర్ కావ్య చొరవ తీసుకోవాలని ప్రయాణికుల విజ్ఞప్తి

హనుమకొండ, సెప్టెంబరు 19 (ఆంధ్రజ్యోతి) : దశాబ్దన్నరకాలంగా ప్రజలకు రైల్వే రిజర్వేషన్ సేవలను అందిస్తున్న హనుమకొండ హెడ్ పోస్టాఫీసు, భూపాలపల్లిలోని పోస్టల్ సూపరింటెండెంట్ ఆఫీసులోని ఇండియన్ పోస్టు ప్యాసింజర్ రిజర్వేషన్ సిస్టమ్ (ఐపీపీఆర్ఎస్) కౌంటర్లు మూతపడ్డాయి. రైల్వే రిజర్వేషన్ల కార్యకలాపాలు జరగని, లేదా రోజుకు పదికన్నా తక్కువ రిజర్వేషన్ల అవుతున్న ఐపీపీఆర్ఎస్ సెంటర్లను మూసివేయాలని భారతీయ తపాలా శాఖ నిర్ణయించింది. ఈ మేరకు దేశవ్యాప్తంగా 165 సెంటర్లను మూసివేయనున్నది. ఇందులో భాగంగా హనుమకొండలోని హెడ్ పోస్టాఫీసు, భూపాలపల్లి ఎస్‌వో పోస్టాఫీసులోని ఐపీపీఆర్ఎస్ సెంటర్లను కూడా మూసింది. తెలంగాణ రాష్ట్రంలో మొత్తం 15 సెంటర్లను మూసివేయాలని నిర్ణయించిన తపాలా శాఖ.. ఇప్పటికే ఎనిమిదింటిని బంద్ చేసింది. మిగిలిన ఏడింటి సెంటర్ల మూసివేత ప్రక్రియను ఈనెల 9వ తేదీలోగానే పూర్తిచేసి ఈనెల 12వ తేదీ నాటికి రిపోర్టు చేయాలని ఆదేశించింది. ఈ సెంటర్లలోని ఐపీపీఆర్ఎస్ పరికరాలను, ఇతర సామానులను రైల్వే అధికారులకు అప్పగించాలని పోస్టుమాస్టర్ జనరల్ పోస్టాఫీజు అధికారులకు రాసిన లేఖలో పేర్కొన్నారు. దీనితో ఈనెల 12 నుంచి సెంటర్లు మూతపడ్డాయి. మరో ఐదు జగిత్యాల, ఎస్‌వీపీఎన్‌పీఏ, హయకత్‌నగర్, సిరిసిల్ల ఎల్ఎస్‌జీ ఎస్‌వో, సెంట్రల్ సెక్రెటేరియేట్‌లలోని సెంటర్లు ఈ యేడు నవంబర్ నెలాఖరు వరకు కొనసాగించి ఆ తర్వాత వాటి పనితీరును బట్టి నిర్ణయం తీసుకుంటారు.

ప్రజలకు ఇబ్బందులు

హనుమకొండ హెడ్‌పోస్టాఫీసు, భూపాలపల్లి పోస్టాఫీసులోని ఐపీపీఆర్ఎస్ సెంటర్లలో రైల్వే రిజర్వేషన్ల సేవలను నిలిపివేతతో గర ప్రజలు, ముఖ్యంగా సీనియర్ సిటిజన్స్ ఇబ్బందులు ఎదురుకానున్నాయి. పోస్టాఫీసుల ద్వారా అందే రైల్వే రిజర్వేషన్ సేవలు దూరం కానున్నాయి. తత్కాల్, రిజర్వేషన్ల సేవలను ఇన్నాళ్లు వీటి ద్వారా పొందిన ప్రజలు.. ఇక నుంచి వరంగల్, కాజీపేట లేదా హసన్‌పర్తి స్టేషన్లకు వెళ్లాల్సిందే. ఐపీపీఆర్ఐ కౌంటర్లు ఉండడం వల్ల రైల్వేస్టేషన్ల ద్వాకా వెళ్లాల్సిన, అక్కడ చాంతాడంతా క్యూలో గంటల తరబడి నిల్చోవలసిన అవస్థలు తప్పేవి. ఈ దృష్ట్యా హనుమకొండ, భూపాలపల్లిలలోని రిజర్వేషన్ కౌంటర్లను కొనసాగించాలని ప్రజలు కోరుతున్నారు. ఈ విషయంలో ఎంపీ డాక్టర్ కడియం కావ్య స్పందించి హనుమకొండ హెడ్‌పోస్టాఫీసులో రైల్వే రిజర్వేషన్ సేవలు కొనసాగేలా చూడాలని విజ్ఞప్తి చేస్తున్నారు.

రూ.1025 కోట్లతో అభివృద్ధి పనులు

(5వ పేజీ తరువాయి)

అందుతున్నాయన్నారు. దేవాదుల రెండో దశ కింద రూ. 148.76కోట్లతో ఘనపూర్ నుంచి నుంచి ఘనపూర్ ప్రధాన కాలువ వరకు అలాగే ప్రధాన డిస్ట్రిబ్యూటరీలకు సీసీ లైనింగ్ పనులు, సీఎం అండ్ సీడీ నిర్మాణ పనులు శరవేగంగా జరుగుతున్నాయని తెలిపారు. అశ్వారావుపేట కుడికాలువ నుంచి రఘునాథపల్లి వరకు కాలువ పనులను అలాగే కాలువల పూడికతీత, అసంపూర్తిగా మిగిలిపోయిన పనులను సత్వరం పూర్తి చేయించానని తెలిపారు. దేవాదుల ఎత్తిపోతల పథకం కింద ప్యాకేజీ-6 ద్వారా నాలుగు నియోజకవర్గాల పరిధిలోని కాలువ పనులు గిట్టుబాటు కాదన్న కారణంతో కాంట్రాక్టర్లు వదిలేసారని, ఈ విషయాన్ని సీఎం దృష్టికి తీసుకువెళ్లగా నాలుగు నియోజకవర్గాల్లో 75వేల ఎకరాలకు సాగునీరు అందించే ఈ ప్రాజెక్టుకు రూ. 1015 కోట్లు మంజూరు చేశారని శ్రీహరి తెలిపారు.

నియోజకవర్గాన్ని విద్యాహబ్‌గా తీర్చిదిద్దేందుకు కృషి చేస్తున్నట్టు కడియం తెలిపారు. జఫర్‌గడ్ మండలం కోనాయచలంలో రూ. 200 కోట్లతో యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ స్కూల్ ఏర్పాటవుతున్నదని, త్వరలో పనులు ప్రారంభవుతాయని చెప్పారు. స్టేషన్ ఘన్‌పూర్‌లో కొత్తగా డిగ్రీ కళాశాలను ప్రభుత్వం మంజూరు చేసిందని, రూ. 6.10 కోట్ల వ్యయంతో పనులు త్వరలో మొదలవుతాయని తెలిపారు. చెల్పూర్ మండల కేంద్రంలో అప్‌గ్రేడెడ్ ఐటీఐ మంజూరు అయిందని, త్వరలో ప్రారంభమవుతుందని చెప్పారు. స్టేషన్ ఘన్‌పూర్‌లో 100 పడకల ఆసుపత్రి ఏర్పాటు ఆవశ్యకతను సీఎం దృష్టికి తీసుకురాగానే మంజూరు ఇచ్చారనీ, రూ. 45.55 కోట్లతో భవన నిర్మాణం జరుగుతోందని తెలిపారు. నియోజకవకర్గంలో 12 ప్రాథమిక ఆరోగ్య ఉపకేంద్రాలు, 3 ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు మంజూరయ్యాయని, ఇవి త్వరలో పని చేయడం ప్రారంభిస్తాయని వెల్లడించారు. స్టేషన్ ఘన్‌పూర్‌లో రూ. 26 కోట్లతో ఇంటిగ్రేటెడ్ డివిజనల్ లెవల్ ఆఫీసు కాంప్లెక్సు నిర్మాణం జరుగుతోందన్నారు. రూ.15 కోట్ల వ్యయంతో తాటికొండ, జిట్టగూడెం మీదుగా మల్లన్నగండి వరకు జాతీయ రహదారి నుంచి మల్లన్నగండి వరకు రోడ్డు పనులు త్వరలో ప్రారంభమవుతాయన్నారు.

రూ.1.50 కోట్లతో వేలేరులో మండల ప్రజాపరిషత్ భవన నిర్మాణానికి త్వరలో టెండర్లు పిలువనున్నట్టు తెలిపారు. రూ. కోటితో స్టేషన్ ఘనపూర్‌లో ఎన్‌పీడీసీఎల్ డివిజనల్ ఆఫీసు కమ్ కార్యాలయ భవన నిర్మాణం జరుగుతోందని, రూ. 2.26 కోట్లతో రఘునాథపల్లి మండలం కుర్చపల్లిలో 33/11 కెవి సబ్‌స్టేషన్ నిర్మాణం, రూ.2.29 కోట్లతో జఫర్‌గడ్ మండలం సాగరంలో 33/11 కెవి సబ్‌స్టేషన్ నిర్మాణం జరుగుతోందని, అలాగే చిల్పూర్ మండలం లింగంపల్లిలో రూ. 2.82 కోట్లతో మరో 33/11 కెవి సబ్‌స్టేషన్ ఏర్పాటుకు టెండర్లు ఖరారయ్యాయని శ్రీహరి తెలిపారు.

నియోజకవర్గంలో పంచాయతీ రోడ్లు, కాలువల నిర్మాణానికి ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నట్టు తెలిపారు. రూ. 8 కోట్లతో బీటీ రోడ్ల మరమ్మతుతో పాటు జనగామ నుంచి జీడికల్లు వరకు రూ. 9.50 కోట్లతో జఫర్‌గడ్ మండలంలో జఫర్‌గడ్ క్రాస్ రోడ్డు నుంచి వెంకటాపూర్ క్రాస్ రోడ్డు వరకు, రూ. 6 కోట్లతో రఘునాథపల్లి మండలం నిడిగొండ నుంచి ఖిలాషాపూర్ వరకు రోడ్ల మరమ్మతుకు టెండర్లు ఖరారయ్యాయని చెప్పారు. రూ. 15 కోట్లతో ఎస్సీ కాలనీల్లో అంతర్గత రోడ్లు, కాలువల నిర్మాణానికి, రూ. 1.76 కోట్లతో ధర్మసాగర్ మండలంలోని పెద్ద పెండ్యాలలో సీసీ రోడ్ల నిర్మాణం, ప్రస్తుతం ఉన్న రోడ్ల వెడల్పు, రూ. 46 లక్షలతో ధర్మసాగర్ మండలంలోని పెద్దపెండ్యాలలో సీసీ రోడ్ల నిర్మాణానికి టెండర్లు పిలవనున్నట్టు తెలిపారు. రూ. 2.33 కోట్లతో నియోజకవర్గంలోని ఏడు కేజీబీవి పాఠశాలల్లో అదనపు సౌకర్యాల కల్పనకు టెండర్లు పిలుస్తున్నట్టు చెప్పారు. రూ. 10 కోట్లతో ఎస్‌డీఎఫ్ కింద చేపట్టిన సీసీ రోడ్లు, పాఠశాలల్లో మౌలిక సదుపాయాలు, తాగునీటి పనులు దాదాపు పూర్తికావచ్చినట్టు తెలిపారు.

రూ. 175 కోట్లతో నియోజకవర్గంలో 3500 ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణం శరవేగంగా జరుగుతోందని కడియం వివరించారు. రూ. 20 కోట్ల ఎంపీలాడ్స్, ఎన్ఆర్ఈజీఎస్ నిధులతో కమ్యూనిటీ హాల్, పంచాయతీ భవనాలు, అంగన్‌వాడీ కేంద్రాల భవనాలు నిర్మాణమవుతున్నాయన్నారు. రూ. 2 కోట్లతో నియోజకవర్గంలోని నమిలిగొండ, ఇప్పగూడెం, మల్కాపూర్, నారాయణగిరి గ్రామాల్లో సీసీ రోడ్లు, డ్రైనేజీల నిర్మాణానికి టెండర్లు ఖరారైనట్లు తెలిపారు. రూ.1.08 కోట్లతో ధర్మసాగర్ మండలం పెద్దపెండ్యాల గ్రామంలో గాంధీ చౌరస్తా నుంచి రెడ్డిపల్లి చర్చి వరకు మిగిలిపోయిన బీటీ, సీసీ రోడ్ల పనులకు టెండర్లు ఖరారైనాయనీ, రూ. 20.78 కోట్లతో ఎస్టీ ఆవాస ప్రాంతాల్లో బీటీ రోడ్ల నిర్మాణానికి త్వరలో టెండర్లు పిలవనున్నట్టు తెలిపారు.

రూ. 200 కోట్లతో మంత్రి మండలి ఆమోదించిన రూ. 1015 కోట్ల అంచనా వ్యయంతో చేపట్టనున్న దేవాదుల మూడవ దశ 6వ సవరించిన ప్యాకేజీ పనుల్లో స్టేషన్ ఘన్‌పూర్ నియోజకవర్గ పరిధిలోని పనులకు సంబంధించి రూ. 200 కోట్ల మంజూరుకు త్వరలో జీవో జారీ కానున్నదన్నారు. రూ. కోటితో ధర్మసాగర్ మండలంలోని ఉనికిచెర్లలో క్రికెట్ స్టేడియం మంజూరైందని తెలిపారు. స్టేషన్‌ఘనపూర్ గ్రామ పంచాయతీ మునిసిపాలిటీగా స్థాయి పెరిగిందని, ఇక్కడ చేపట్టనున్న అభివృద్ధి పనుల ప్రతిపాదనలు ప్రభుత్వానికి సమర్పించామని తెలిపారు.

విప్లవ సంస్థల విలీన సభ పోస్టర్ ఆవిష్కరణ

కేసముద్రం, సెప్టెంబర్ 19 (ఆంధ్రజ్యోతి) : బయ్యారంలో ఈనెల 24న సీపీఐ(ఎంఎల్) న్యూడెమోక్రసీ, రెవల్యూషనరీ సంస్థల విలీన సభను జయప్రదం చేయాలని కోరుతూ పెనుగొండలో శుక్రవారం ఎన్డీ జిల్లా నాయకులు ఎస్‌కె.మదార్ పోస్టర్ ఆవిష్కరణ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దేశంలో ప్రశ్నించే గొంతుకలను ప్రభుత్వం అణిచివేస్తోందని, ప్రజల పక్షాన నిలబడి పోరాడుతున్న విప్లవ సంస్థ ఐక్యం కావాల్సిన అవసరం ఉందని అన్నారు. కార్యక్రమంలో ప్రజాసంఘాల నాయకులు కన్నంత రెడ్డి భాస్కర్‌రెడ్డి, సట్ల యాకయ్య, ధరావత్ సుమన్, శంకర్, వీరస్వామి, యాకయ్య, లక్ష్మణ్;బాఅలు పాల్గొన్నారు.

చదువుతో పాటు సైన్స్‌లో రాణించాలి

● జిల్లా విద్యాశాఖాధికారి దక్షిణామూర్తి

మహబూబాబాద్ ఎడ్యుకేషన్, సెప్టెంబరు 19 (ఆంధ్రజ్యోతి) : చదువుతో పాటు సైన్స్‌లో రాణించాలని జిల్లా విద్యాశాఖాధికారి దక్షిణామూర్తి అన్నారు. మహబూబాబాద్ మోడల్ స్కూల్‌లో శుక్రవారంజిల్లా స్థాయి సైన్స్ డ్రామా పోటీలు నిర్వహించారు. ఈ సందర్భంగా డీఈవోమాట్లాడుతూ విద్యార్థులు చదువుతో పాటు సైన్స్, సామాజిక అంశాలపై అవగాహన పెంచుకోవాలని సూచించారు. ఆధునిక సాంకేతికరంగంలో వస్తున్న మార్పులకు అనుగుణంగా ఉపాధ్యాయులు పాఠ్యాంశాలతో పాటు సైన్స్‌పై అవగాహన కల్పించాలన్నారు. జిల్లా సైన్స్ అధికారి అప్పారావు మాట్లాడుతూ జిల్లా సైన్స్ డ్రామా పోటీల్లో 12 నాటికలు ప్రదర్శించగా జిల్లా కేంద్రంలోని ఏకశిలా ఏంజిల్స్ హై స్కూల్ విద్యార్థులు ప్రథమ, కేసముద్రం శ్రీవివేకవర్ధిని



విద్యార్థినికి గుర్తింపు కార్డును అందచేస్తున్న డీఈవో దక్షిణామూర్తి

పాఠశాల విద్యార్థులు ద్వితీయస్థానం, పెద్దవంగర కస్తూర్బాగాంధీ బాలికా విద్యాలయ విద్యార్థినులు తృతీయస్థానాల్లో నిలిచి రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికైనట్లు తెలిపారు. న్యాయనిర్ణేతలుగా శ్రీనివాస్, సోమకృష్ణ, భాస్కర్, అప్పారావులు వ్యవహరించారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాల్ ఉపేందర్‌రావు, అధ్యాపకులు సునిల్ పాల్గొన్నారు.

విద్యార్థులు ఉత్తమ ఫలితాలు సాధించాలి

● నెల్లికుదురు : విద్యార్థులు కష్టపడి చదివి ఉన్నత ఫలితాలు సాధించాలని డీఈవో దక్షిణామూర్తి తెలిపారు. నెల్లికుదురు మండలంలోని జడ్పీహెచ్‌ఎస్ ఆలేరు విద్యార్థులకు డీఈవో దక్షణమూర్తి శుక్రవారం గుర్తింపు కార్డులు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులు కష్టపడి చదివి ఉత్తమ పలితాలు సాధించాలన్నారు. అమెరికాలో ఉంటున్న రంగారావు లగడపాటి సహకారంతో గుర్తింపు కార్డులు అందించడం జరిగిందన్నారు. ఈకార్యక్రమంలో ఎంఈవో రాందాస్, ఉపాధ్యాయులు గుమ్మడవెల్లి మహేష్ ,విద్యార్థులు పాల్గొన్నారు.

ఆటో దొంగిలించిన వ్యక్తి అరెస్టు : సీఐ



ఆటో దొంగిలించిన వ్యక్తిని అరెస్టు చూపుతున్న సీఐ మహేందర్‌రెడ్డి

మహబూబాబాద్ క్రైం, సెప్టెంబరు 19 (ఆంధ్రజ్యోతి) : మానుకోట పట్టణంలో ఆటో దొంగిలించిన వ్యక్తిని అరెస్ట్ చేసి రిమాండ్‌కుతరలించినట్లు టౌన్ సీఐ గట్ల మహేందర్‌రెడ్డి తెలిపారు. మహబూబాబాద్ టౌన్ పోలీసుస్టేషన్‌లోశుక్రవారం వివరాలు వెల్లడించారు. జిల్లాలోని కురవి మండలం తట్టుపల్లికి చెందిన యాసారపు శ్రీకాంత్ ఆటోను నడుపుకుంటూ కుటుంబాన్ని పోషించుకుంటున్నాడు. శుక్రవారం ఉదయం ఆటోను పట్టణంలోని కూరగాయల మార్కెట్ ఎదురుగా పార్కింగ్ చేసి, కూరగాయలు కొనుగోలు చేసి తిరిగి ఆటో దగ్గరకు రాగా, పార్కింగ్ చేసిన ఆటో కనిపించ లేదు. వెంటనే టౌన్ పోలీస్‌స్టేషన్‌లో చేసిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు దర్యాప్తు చేస్తున్న క్రమంలో.. మానుకోట పట్టణంలోని వైఎస్‌ఆర్ సర్కిల్‌లో వాహనాలు తనిఖీ చేస్తున్న పోలీస్ సిబ్బందిని చూసి పారిపోవడానికి ప్రయత్నించాడు. వెంటనే అతనిని అదుపులోకి తీసుకొని విచారించగా, కురవి మండలం తాట్యా తండా కొత్తూరు జీకి చెందిన బాదావత్ గాంధీ ఆటోను అపహరించినట్లు ఒప్పుకోవడంతో అతడిపై కేసు నమోదు చేసి, రిమాండ్‌కు తరలించినట్లు సీఐ తెలిపారు.

చికిత్స పొందుతూ వృద్ధురాలు మృతి

డోర్నకల్, సెప్టెంబరు 19 (ఆంధ్రజ్యోతి) : మతిస్థిమితం లేని ఓ మహిళ పురుగుల మందుతాగి చికిత్స పొందుతూ శుక్రవారం మృతి చెందింది. డోర్నకల్ హెడ్‌కానిస్టేబుల్ కోటేశ్వర్‌రావు తెలిపిన వివరాల ప్రకారం. డోర్నకల్ మండలం జోగ్యతండాకు చెందిన బానోత్ లక్ష్మి (65) అనే మహిళకు మతిస్థిమితం సరిగా ఉండదు. ఈ క్రమంలో తమ వ్యవసాయ క్షేత్రం వద్దకు వెళ్లిన లక్ష్మి అక్కడ ఉన్న డబ్బాలోనే పురుగుల మందును తాగింది. ఇది గమనించిన కుటుంబసభ్యులు చికిత్స నిమిత్తం ఖమ్మంలోని ఓ ఆస్పత్రికి తరలించారు. అక్కడ చికిత్సపొందుతూ.. లక్ష్మి మృతి చెందింది. ఈ మేరకు లక్ష్మి మనుమడు బానోత్ నాగ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు హెడ్‌కానిస్టేబుల్ తెలిపారు.

చిన్నతనం నుంచే చదువుపై శ్రద్ధ పెట్టాలి

మహబూబాబాద్ టౌన్, సెప్టెంబరు 19 (ఆంధ్రజ్యోతి) : చిన్నతనం నుంచే విద్యార్థులు చదువు శ్రద్ధ పెట్టి ఉన్నత శిఖరాలకు ఎదగాలని లయన్స్‌క్లబ్ మానుకోట శాఖ అధ్యక్షుడు డాక్టర్ బి.వీరన్న అన్నారు. లయన్స్‌క్లబ్-320 ఎఫ్ డిస్ట్రిక్ట్ గవర్నర్ డాక్టర్ కె.ఆర్యా, సతీమణి డాక్టర్ రాజేశ్వరీల పుట్టిన రోజును పురస్కరించుకుని లయన్స్‌క్లబ్ ఆధ్వర్యంలో స్థానిక భవానీనగర్ ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో శుక్రవారం పిల్లలకు నోట్ పుస్తకాలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా డాక్టర్ బి. వీరన్న మాట్లాడుతూ సమాజంలో ఏరంగంలో రాణించాలన్న విద్యసరైన మార్గమని చెప్పారు. అందుకోసం ప్రాథమిక స్థాయి నుంచే లక్ష్యాన్ని ఎంచుకుని దానిని సాధించడానికి ప్రణాళిక బద్ధంగా ముందుకు సాగాలని సూచించారు. క్లబ్ సెక్రటరీ పర్కాల రవీందర్‌రెడ్డి, కోశాధికారి కొండపల్లి కరుణాకర్‌రెడ్డి, బాధ్యులు డాక్టర్ వి.జగన్మోహన్‌రావు, బవిరిశెట్టి నాగేశ్వర్‌రావు, సాదుల సురేష్‌బాబు, మాలె కాశీనాథ్, హెచ్‌ఎం శోభారాణి, ఉపాధ్యాయులు మాలతి, చంద్రం, కవిత, లలిత పాల్గొన్నారు.



నోటు పుస్తకాలను పంపిణీ చేస్తున్న లయన్స్ క్లబ్ బాధ్యులు



బతుకమ్మ వేడుకలో పాల్గొన్న ప్రిన్సిపాల్, అధ్యాపకులు, విద్యార్థినులు

విద్యాసంస్థల్లో బతుకమ్మ వేడుకలు

మహబూబాబాద్ ఎడ్యుకేషన్, సెప్టెంబరు 19 (ఆంధ్రజ్యోతి) : జిల్లా కేంద్రంలోని విద్యాసంస్థల్లో శుక్రవారం బతుకమ్మ సంబురాలను నిర్వహించారు. పాఠశాలలకు ఈనెల 21 నుంచి సెలవులు ప్రకటించడంతో పాఠశాలల్లో బతుకమ్మ వేడుకలను నిర్వహించారు. తీరొక్క పూలతో పేర్చిన బతుకమ్మలను ఒక్కచోట చేర్చి తెలంగాణ సంస్కృతి సంప్రదాయ బతుకమ్మ పాటలు పాడుతూ.. వైభవంగా నిర్వహించారు. జిల్లా కేంద్రంలోని లెర్నింగ్ ట్రీ పాఠశాలలో యాళ్ల సాధనారెడ్డి నేతృత్వంలో ఉపాధ్యాయినీలు, విద్యార్థినులు బతుకమ్మలను పేర్చగా, పర్వదినం యొక్క ప్రాముఖ్యతను వివరించారు. నూకల రాంచంద్రారెడ్డి ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఎన్‌ఎస్ఎస్ యూనిట్ పీవో అన్నపూర్ణ ఆధ్వర్యంలో బతుకమ్మలను పేర్చి వేడుకలు నిర్వహించారు. ప్రిన్సిపాల్ లక్ష్మణ్‌నాయక్, వైస్‌ప్రిన్సిపాల్ శ్రీని వాసులు, అధ్యాపకులు రాజశేఖర్, అనిల్‌కుమార్, మసూద్ అహ్మద్, సాంబశివరావు, వినోద్‌కుమార్, శ్రీనివాస్, హతిరామ్, ఖాసీంషా, సుమన్, ఉపేందర్, వీరు, సుమలత, సంతోష్‌కుమార్ పాల్గొన్నారు,

ఆటోమెటిక్ మీటర్ రీడింగ్‌తో వినియోగదారులకు ఉపయోగం

● జిల్లా విద్యుత్ శాఖ అధికారి విజేందర్‌రెడ్డి



మహబూబాబాద్ రూరల్, సెప్టెంబరు 19 (ఆంధ్రజ్యోతి) : ఆటోమెటిక్ మీటర్ రీడింగ్‌తో విద్యుత్ వినియోగదారులకు ఎంతో ఉపయోగకరమని జిల్లా విద్యుత్ శాఖ అధికారి విజేందర్‌రెడ్డి శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. విద్యుత్ వినయోగదారులకు మాన్యువల్ బిల్లింగ్ సమస్యలు లేకుండా ఉండేందుకు ఆటోమెటిక్ మీటర్ రీడింగ్ ఎంతగానే దోహదపడుతుందన్నారు. ఇందులో బాగంగా సర్కిల్‌లో అధిక సామర్థ్యం విద్యుత్ వినియోగించే పరిశ్రమలకు వీటిని ప్రయోగాత్మకంగా ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. మీటరు రీడింగ్స్ హైటల్టేజీ విద్యుత్ వాడుకునే కేటగిరి లల్లో 55హెచ్‌పీకి మించి సామర్థ్యం ఉంటే ఏడీఈ, 55లోపు హెచ్‌పీ ఉంటే ఏఈ స్థాయి అధికారి సేకరిస్తారని చెప్పారు. నాన్ స్లాబ్ రీడింగ్‌ను లైన్ ఇనిస్పెక్టర్లు స్లాబ్ రీడింగ్‌ను ప్రైవేటు జూనియర్ లైన్మెన్‌లు సేకరిస్తారన్నారు. ఆటోమెటిక్ రీడింగ్ వలన తప్పులు జరిగే ప్రసక్తి ఉండదని, విద్యుత్ సరఫరాలో హెచ్ తగ్గులను త్వరితగతిన గుర్తించ వచ్చన్నారు. ఏఎంఆర్ అంటే స్మార్ట్ మీటర్ సిస్టమ్ విద్యుత్ వినియోగాన్ని కొలిచే సాదనం. మీటర్‌లో 4జీ కమ్యూనికేషన్ సిమ్ వాడుతూ దీనితో నమోదైన డేటా ఎలాంటి మానవ ప్రమేయం లేకుండా హన్మకొండలోని సెంట్రల్ సర్వర్‌కు చేరుతుందని చెప్పారు. సిబ్బందికి ఖర్చులేకుండా 30 రోజుల్లో ఖచ్చితమైన బిల్లింగ్ వస్తుందని చెప్పారు.

గుడుంబా స్థావరాలపై ఎక్సైజ్ దాడులు

డోర్నకల్, సెప్టెంబరు 19 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని గుడుంబా స్థావరాలపై ఎక్సైజ్ పోలీసులు శుక్రవారం దాడులు నిర్వహించి, ఐదుగురిపై కేసు నమోదు చేసినట్లు మహబూబాబాద్ ఎక్సైజ్ సీఐలు సీహెచ్.నాగేశ్వర్‌రావు, నీరజ తెలిపారు. వారు తెలిపిన వివరాల ప్రకారం. అమ్మపాలెం, రామకుంట తండా, తోడేళ్లగూడెం, తెల్లబండతండాకు చెందిన కొందరు వ్యక్తులు అక్రమంగా గుడుంబా తయారు చేసి విక్రయిస్తున్నట్లు అందిన సమాచారం మేరకు సిబ్బందితో కలిసి గుడుంబా స్థావరాలపై దాడులు నిర్వహించినట్లు చెప్పారు. ఈ దాడుల్లో 14 లీటర్ల గుడుంబాను స్వాధీనం చేసుకుని 900 లీటర్ల ఉరవేసిన చక్కర పానకాన్ని ధ్వంసం చేసినట్లు తెలిపారు. గుడుంబా తయారు చేస్తున్న ఐదుగురిపై కేసు నమోదు చేసి డోర్నకల్ తహసీల్దార్ ఇమ్మాన్యుయేల్ ఎదుట బైండోవర్ చేసినట్లు చెప్పారు. ఈ దాడుల్లో ఎక్సైజ్ ఎస్సైలు చంద్రశేఖర్, అశోక్ కుమార్, కిరీటి, హెడ్‌కానిస్టేబుల్ మధు, కానిస్టేబుళ్లు యాదగిరి, వెంకటరమణ, నర్సింగరావు, ఇబ్రహీం, శ్రీనివాస్ పాల్గొన్నారు.

యూరియా అందించడంలో కేంద్రం విఫలం

కురవి, సెప్టెంబరు 19 (ఆంధ్రజ్యోతి) : రైతులకు యూరియా అందించడంలో కేంద్రప్రభుత్వం పూర్తిగా విఫలమైందని సీపీఎం, సీపీఐ, బీఆర్‌ఎస్ నాయకులు నెల్లూరు నాగేశ్వర్‌రావు, పిట్టల వెంకన్న, నామ సైదులు అన్నారు. రైతులందరికి యూరియా అందించాలని డిమాండ్ చేస్తూ బలపాల గ్రామపంచాయతీ ఎదుట శుక్రవారం ధర్నా నిర్వహించారు. తెలంగాణలో బీజేపీకి 8 మంది ఎంపీలు, ఇద్దరు కేంద్ర మంత్రులు ఉన్నప్పటికి యూరియా తీసుకురావడంతో పూర్తిగా విఫలమయ్యారని విమర్శించారు. ఈ ధర్నాలో ఆయా పార్టీల నాయకులు రామగాని రవి, రేపాల పాపయ్య, బత్తుల వెంకన్న, వెంకన్న, లాలయ్య, రంగారావు పాల్గొన్నారు.

పూల జాతర

(5వ పేజీ తరువాయి)

నీటిని శుద్ధిచేసి, నీటి ద్వారా వచ్చే రోగాలను హరిస్తాయి.

తొమ్మిది రోజులు..

తొమ్మిదిరోజులు జరుపుకునే బతుకమ్మ పండుగలో ఎన్నో విశిష్టతలు దాగి ఉన్నాయి. అడపడుచులు తమ మనోభావాలను పాటల ద్వారా వెల్లడిస్తారు. సంతోషాన్ని అడుగులు, చప్పట్ల ద్వారా ప్రదర్శిస్తూ పరవశత్వం చెందుతారు. స్త్రీల సౌందర్య ఆరాధనం, అలంకార నైపుణ్యం, కళాత్మక దృష్టి, బతుకమ్మను పేర్చడంలో ఉట్టిపడుతుంది. పండుగలో తల్లి బతుకమ్మ, పిల్ల బతుకమ్మలు పేర్చడం ద్వారా తల్లి పక్కనే పిల్ల ఉండాలనే స్త్రీ మాతృ హృదయం ఎలాంటిదో అవగతమవుతుంది. త్రికోణం స్త్రీకి సంకేతం. త్రికోణం(పిరమిడ్ ఆకారం)లోని పసుపు ముద్ద సంతాన, సౌభాగ్య ప్రదాయిని అయిన గౌరీదేవికి చిహ్నమని పూర్వీకులు ఆడపడుచులకు అర్థమయ్యే రీతిలో చెబుతుంటారు. 'బతుకమ్మ బతుకమ్మ ఉయ్యాలో.. బంగారు బతుకమ్మ ఉయ్యాలో' అంటూ సాయంత్రం ఇంటి ముందు కానీ, వీధిలో కానీ, దేవాలయంలో, చెరువు, వాగుల్లో ఇలా ప్రతీ చోటా ఆడపడుచులంతా చేరి బతుకమ్మలను మధ్యలో ఉంచి పాటలు పాడతారు. ఒకరు పాడుతుంటే మిగతా మహిళలంతా వంతపాడుతుంటారు.

అగ్రవర్ణాల పెత్తనం కొనసాగనివ్వం

(5వ పేజీ తరువాయి)

ఇళ్లు నిర్మిస్తామని తెలిపారు. రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి బీసీల రిజర్వేషన్లపై డ్రామాలు చేస్తూ బీసీల ద్రోహిగా నిలిచారని ధ్వజమెత్తారు. కామారెడ్డి డిక్లరేషన్‌లో పొందుపర్చిన 18 హామీలలో ఒక్కటి కూడా అమలు చేయలేదని అన్నారు. రాష్ట్రంలో 33 శాతం ఉన్న బీసీ రిజర్వేషన్లను 23 శాతానికి తగ్గించి గత బీఆర్‌ఎస్ పార్టీ బీసీలను మోసం చేసిందన్నారు. రాబోయే రోజుల్లో టీఆర్‌పీ పార్టీ బలోపేతానికి అన్ని పార్టీల్లోని బీసీలు కలిసి రావాలని తీన్మార్ మల్లన్న పిలుపునిచ్చారు. జాగృతి పార్టీకి మూడు వేల ఓట్లు లేవని, ఆమెను వాళ్ల నాన్నే (కేసీఆర్) కలవడం లేదని ఎద్దేవా చేశారు. 90 శాతం జనాభా ఉన్న బీసీలం ఎందుకు కలుస్తామన్నారు. బీసీలను అణచివేసేందుకు అగ్రవర్ణాలు కుట్రలు చేస్తున్నారని మండిపడ్డారు. కాంగ్రెస్ పార్టీని తాను వీడలేదని, కాంగ్రెస్ పార్టీయే తనను బయటకు పంపించిందన్నారు. రాబోయే రోజుల్లో టీఆర్‌పీ విధానాలు నచ్చి కాంగ్రెస్ నాయకులు కలిసి వస్తే స్వాగతిస్తామన్నారు.

స్వశక్తితో అభివృద్ధి సాధించేలా ఎదగాలి

● ఎమ్మెల్సీ తక్కెళ్లల్లి రవీందర్‌రావు

మహబూబాబాద్ ఎడ్యుకేషన్, సెప్టెంబరు 19 (ఆంధ్రజ్యోతి) : స్వశక్తితో ఆర్థికంగా అభివృద్ధి సాధించేలా ఎదగాలని ఎమ్మెల్సీ తక్కెళ్లపల్లి రవీందర్ రావు అన్నారు. మహబూబాబాద్‌లోని ప్రభుత్వ బాలికల జూనియర్ కళాశాలలో శుక్రవారం ప్రథమ సంవత్సర విద్యార్థినులకు ఫ్రెషర్స్ డే వేడుకలు నిర్వహించారు. ప్రిన్సిపాల్ పొక్కుల సదానందం అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిధిగా హాజరైన రవీందర్‌రావు మాట్లాడారు. క్రమశిక్షణతో కూడిన విద్యనభ్యసించి ఉన్నత స్థానాలకు చేరుకోవాలని సూచించారు. చదువుతోనే సమాజంలో గుర్తింపు వస్తుందని పేర్కొన్నారు. చదువుకు పేదరికం అడ్డుకాదని, చదువుతోనే సకల సమస్యలకు పరిష్కారం పొందవచ్చన్నారు. పట్టుదల, క్రమశిక్షణతో చదువుకొని తల్లిదండ్రులు, కళాశాలకు పేరు తీసుకురావడంతో పాటు భవిష్యత్తులో ఉన్నత స్థానాలకు చేరుకోవాలన్నారు. విద్యార్థినులు చేసిన నృత్యాలు ఎంతగానో ఆకట్టుకున్నాయి. ఈ కార్యక్రమంలో మాజీ మునిసిపల్ చైర్మన్ పాల్వాయి రామ్మోహన్‌రెడ్డి, మాజీ వైస్ చైర్మన్ మార్నేని వెంకన్న, నయిమ్‌పాషా, గణేష్, వీవీ నాగేందర్, నాగిరెడ్డి, పర్వీన్‌బేగం, సాదిక్ అలీ, శ్రీనివాస్, రవికిరణ్, రియాజ్, సురేందర్, శ్రీను, నవీన్‌కుమార్, కిరణ్‌కుమార్, స్వాతి, భార్గవి, సరిత, స్వరూప, సృజన, స్వాతిరాణి, పూర్ణిమ, శ్రావణ్, రవి, భాగ్యలక్ష్మి, కళావతి, సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.



ప్రభుత్వ బాలికల జూనియర్ కళాశాల ఫ్రెషర్స్ డే వేడుకలో మాట్లాడుతున్న ఎమ్మెల్సీ తక్కెళ్లపల్లి రవీందర్‌రావు



ఎస్‌జీఎఫ్ఐ క్రీడల్లో పాల్గొన్న క్రీడాకారులు

మండల స్థాయి ఎస్‌జీఎఫ్ఐ క్రీడలు

ఇనుగుర్తి, సెప్టెంబరు 19 (ఆంధ్రజ్యోతి) : ఇనుగుర్తి జడ్పీ హైస్కూల్లో శుక్రవారం మండల స్థాయి ఎస్‌జీఎఫ్ఐ క్రీడలను ఎంఈవో రూపారాణి ప్రారంభించారు. కార్యక్రమంలో ఎస్‌జీఎఫ్ఐ జిల్లా కార్యదర్శి జి.సత్యనారా యణ, వద్దిరాజు దేవేందర్, వెంకన్న, ప్రిన్సిపాల్ జయశ్రీ, హెచ్ఎం వీరన్న, పీడీ చెడుపల్లి ఐలయ్య, పాల్గొన్నారు.

బైక్ నుంచి పడి రైతుకు గాయాలు

నెల్లికుదురు, సెప్టెంబరు 19 (ఆంధ్రజ్యోతి) : యూరియా కోసం వెళ్తూ.. బైక్ పైనుంచి పడి ఓ రైతు గాయపడ్డాడు. ఈ ఘటన నెల్లికుదురు మండలం బ్రాహ్మణకొత్తపెల్లి గ్రామంలో శుక్రవారం జరిగింది. స్థానికుల కథనం ప్రకారం వివరాలు ఇలా ఉన్నాయి. బ్రాహ్మణకొత్తపెల్లికి చెందిన బొల్లు భరత్‌కు మూడెకరాల వ్యవసాయ భూమి ఉంది. ఈ భూమిలో వరిపంటను సాగు చేస్తున్నాడు. పొలానికి యూరియా అవసరముండగా ఉదయం నెల్లికుదురు సొసైటీకి వచ్చి బస్తా తీసుకొని వెళ్లి బ్రాహ్మణకొత్తపెల్లి ఉన్న తనఇంట్లో వేశాడు. మరోబస్తా కోసం మళ్లీ నెల్లికుదురుకు వస్తున్న క్రమంలో బ్రాహ్మణకొత్తపెల్లి గ్రామం దాటినంతరం బైక్ అదుపు తప్పి, రోడ్డుపై పడటంతో తలకు బలమైన గాయాలయ్యాయి. వెంటనే భరత్‌ను గ్రామస్థులు నెల్లికుదురు పీహెచ్‌సీకి తరలించి, ప్రథమ చికిత్స చేయించారు. అనంతరం మెరుగైన చికిత్స కోసం అక్కడి నుంచి హన్మకొండలోని ఓ ప్రైవేటు ఆస్పత్రికి తరలించారు.

8వ వేతన సంఘాన్ని ఏర్పాటు చేయాలి

● దక్షిణ మధ్య రైల్వే మజ్దూర్ యూనియన్ డిమాండ్



ఆందోళన చేస్తున్న మజ్దూర్ యూనియన్ నాయకులు

డోర్నకల్, సెప్టెంబరు 19 (ఆంధ్రజ్యోతి) : రైల్వే ఉద్యోగుల న్యాయమైన డిమాండ్‌లను కేంద్రప్రభుత్వం పరిష్కరించాలని దక్షిణ మధ్య రైల్వే మజ్దూర్ యూనియన్ డోర్నకల్ బ్రాంచ్ సెక్రటరీ అంజియాదవ్, చైర్మన్ చరణ్‌నాయక్ డిమాండ్ చేశారు. ఈ మేరకు శుక్రవారం డోర్నకల్‌లోని సీనియర్ సెక్షన్ ఇంజనీర్ కార్యాలయం, రైల్వే స్టేషన్‌లోని క్రూలాబీ, ఓహెచ్‌ఈ కార్యాలయం వద్ద మజ్దూర్ యూనియన్ ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. 8వ వేతన సంఘాన్ని ఏర్పాటు చేయాలని, 2026 జనవరి నుంచి అమల్లోకి వచ్చే విధంగా పే కమిషన్‌ను అమలు చేయాలన్నారు. నాయకులు సుందర్, కరణ్‌సింగ్, నాగేషు, బాలాజీ, అరుణ్, శ్రీనివాస్, బెజవాడ కృష్ణ, నాగరాజు, వీరాంజనేయులు, సైదులు, నరేష్, శ్రీనివాస్‌లు పాల్గొన్నారు.

టీయూఎఫ్ మానుకోట నియోజకవర్గ ఇన్‌చార్జిగా కృష్ణ



మహబూబాబాద్ టౌన్, సెప్టెంబరు 19 (ఆంధ్రజ్యోతి) : తెలంగాణ ఉద్యమకారుల ఫోరం (టీయూఎఫ్) మానుకోట నియోజకవర్గ ఇన్‌చార్జిగా పట్టణానికి చెందిన దేశగాని కృష్ణ గౌడ్ నియామకమయ్యారు. ఈ మేరకు రాష్ట్ర అధ్యక్షుడు చీమ శ్రీనివాస్ శుక్రవారం ప్రకటించి నియామక పత్రాన్ని అందించారు. దేశగాని కృష్ణ తెలంగాణ ఉద్యమంలో ముఖ్య భూమిక పోషించాడు. టీయూఎఫ్‌లో క్రియాశీలకంగా పని చేయడంతో ఆయన సేవలను గుర్తించిన రాష్ట్ర నాయకత్వం నియోజకవర్గ ఇన్‌చార్జిగా అవకాశం కల్పించారు. తన నియామకానికి కృషి చేసిన రాష్ట్ర కమిటీ బాధ్యులకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. మహబూబాబాద్ జిల్లా కేంద్రంలోని తెలంగాణ అమర వీరుల స్థూపం వద్దకు ఈ నెల 21న బస్సుయాత్ర వస్తుందని ఉద్యమకారులు తరలి వచ్చి జయప్రదం చేయాలని దేశగాని కృష్ణ కోరారు.



డీఈవో దక్షిణామూర్తిని సన్మానిస్తున్న గిరిజన సామాజిక చైతన్య వేదిక వ్యవస్థాపకుడు కిషన్‌నాయక్

తండాల్లో పాఠశాలలను నెలకొల్పాలి

మహబూబాబాద్ ఎడ్యుకేషన్, సెప్టెంబరు 19 (ఆంధ్రజ్యోతి) : జిల్లా వ్యాప్తంగా ప్రభుత్వ పాఠశాలలు లేని గిరిజనతండాల్లో పాఠశాలలను నెలకొల్పాలని గిరిజన సామాజిక చైతన్య వేదిక వ్యవస్థాపకుడు గుగులోతు కిషన్‌నాయక్ విజ్ఞప్తి చేశారు. జిల్లా కేంద్రంలోని డీఈవో కార్యాలయంలో జిల్లా విద్యాశాఖాధికారి దక్షిణామూర్తికి శుక్రవారం సన్మానించి, వినతి పత్రం అదంజేశారు. ఈ సందర్భంగా కిషన్‌నాయక్ మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలలు లేని గిరిజన తండాల్లో పాఠశాలలను స్థాపించి గిరిజనుల విద్యాభివృద్ధికి కృషిచేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో సెక్టోరియల్ అధికారులు సంతోష్, మందుల శ్రీరాములు, అప్పారావు, శంకర్, వినోద్‌కుమార్ పాల్గొన్నారు.

కార్మికులకు పెండింగ్ వేతనాలు ఇవ్వాలి

మహబూబాబాద్ టౌన్, సెప్టెంబరు 19 (ఆంధ్రజ్యోతి) : మునిసిపల్ కార్మికులకు పెండింగ్ వేతనాలు వెంటనే చెల్లించాలని ఏఐటీయూసీ జిల్లా నాయకులు వెలుగు శ్రావణ్, పుచ్చకాయల రమణ విజ్ఞప్తి చేశారు. మహబూబాబాద్ మునిసిపల్ కార్యాలయంలో శుక్రవారం వినతి పత్రాన్ని అందించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మునిసిపాలిటీ నాలుగు గ్రూపులకు సంబంధించిన కార్మికులకు మార్చినెల వేతనాలు పెండింగ్‌లో పడిందని దీంతో ఇబ్బందులు పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. బతుకమ్మ, దసరా పండుగ వస్తున్న సందర్భంగా వారికి వేతనాలు చెల్లించాలని కోరారు. కార్యక్రమంలో లింగాల విజయ్, పుల్లూరి నాగేశ్వర్‌రావు, ఆనంద్, దాసరి రాంమూర్తి, శ్రీను పాల్గొన్నారు.

గిరిజనుల కోసం ఉద్యమిస్తే కేసులా?

● సీపీఎం జిల్లా కార్యదర్శి సాదుల శ్రీనివాస్

మహబూబాబాద్ టౌన్, సెప్టెంబరు 19 (ఆంధ్రజ్యోతి) : నూతన కలెక్టరేట్ భవన నిర్మాణం కోసం సాలార్‌తండా గిరిజన రైతుల భూములు లాక్కుంటే వారి తరఫున ఉద్యమిస్తే నాటి బీఆర్‌ఎస్ ప్రభుత్వం అక్రమ కేసులు బనాయించిందని సీపీఎం జిల్లా సాదుల శ్రీనివాస్ ఆరోపించారు. గిరిజన తరఫున పోరాడిన ఉద్యమ కేసులో మానుకోట జిల్లా కోర్టుకు శుక్రవారం సీపీఎం జిల్లా కార్యదర్శి సాదుల శ్రీనివాస్, సీపీఐ పట్టణ పట్టణ కార్యదర్శి పెరుగుకుమార్, రేషపల్లి నవీన్, రైతులు అంగోతు శివాజీ, సురేష్, సురేందర్, వీరు, వెంకన్న హాజరయ్యారు.

విద్య, వైద్యరంగాలను విస్మరిస్తున్న ప్రభుత్వం

మహబూబాబాద్ ఎడ్యుకేషన్, సెప్టెంబరు 19 (ఆంధ్రజ్యోతి): విద్య, వైద్యరంగాలను రాష్ట్రప్రభుత్వం విస్మరిస్తోందని పీడీఎస్‌యూ జిల్లా ప్రధాన కార్యదర్శి బానోత్ దేవేందర్ అన్నారు. మహబూబాబాద్‌లో శుక్రవారం నిర్వహించిన సమావేశంలో మాట్లాడుతూ ఫీజురియింబర్సుమెంట్ ఆలస్యం వలన పేద విద్యార్థుల భవిష్యత్తును రాష్ట్ర ప్రభుత్వం అందకారంలోకి నెడుతుందని ఆరోపించారు. హాస్టళ్లకు స్వంత భవనాలు లేకపోవడం, పౌష్టికాహారం, తాగునీటి లేమితో విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నారన్నారు. ప్రభుత్వ ఆస్పత్రుల్లో సిబ్బంది, మందుల కొరత వలన ప్రజలు ఇబ్బందులు పడుతున్నారన్నారు. విద్యా, వైద్యంపై ప్రభుత్వం ఇదే విధమైన నిర్లక్ష్యం కొనసాగిస్తే ఉద్యమం తప్పదని హెచ్చరించారు. ఈ సమావేశంలో నవీన్, విక్రమ్, పవన్, మహేష్ పాల్గొన్నారు.



పీడీఎస్‌యూ సమావేశంలో మాట్లాడుతున్న జిల్లా ప్రధాన కార్యదర్శి దేవేందర్



జ్వర పీడితులకు వైద్య పరీక్షలు నిర్వహిస్తున్న వైద్య సిబ్బంది

ఇందిరానగర్ కాలనీలో వైద్య శిబిరం

మహబూబాబాద్ క్రైం, సెప్టెంబరు 19 (ఆంధ్రజ్యోతి) : మహబూబాబాద్ పట్టణంలోని ఇందిరానగర్ సబ్‌సెంటర్, బీసీ కాలనీలో వైద్యశిబిరం నిర్వహించినట్లు సబ్ యూనిట్ ఆఫీసర్ వడ్డెబోయిన శ్రీనివాస్ శుక్రవారం తెలిపారు. 30 మందికి వైద్యపరీక్షలు నిర్వహించి, 18 మందికి రక్తపూతలు స్వీకరించినట్లు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సీజనల్ వ్యాధుల పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలన్నారు. పరిశరాల పరిశుభ్రతతో పాటు చుట్టూ ఉండే ప్రదేశాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలన్నారు. దోమల నుంచి రక్షణపొందేందుకు దోమ తెరలు వాడుకోవాలన్నారు. హెల్త్ ఎడ్యూకేటర్ పురుషోత్తం, ఏఎన్ఎం అశ్విని, ఆశాలు రాధా బాయ్, మమత, మాధవి, విజయ పాల్గొన్నారు.

ఆటవస్తువుల పంపిణీ



ఆటవస్తువులను పంపిణీ చేస్తున్న లయన్స్‌క్లబ్ ప్రతినిధులు

కేసముద్రం, సెప్టెంబర్ 19 (ఆంధ్రజ్యోతి) : కేసముద్రం మునిసిపాలిటీ సబ్‌స్టేషన్‌తండా అంగన్‌వాడీ కేంద్రంలో శుక్రవారం లయన్స్‌క్లబ్ 320ఎఫ్ డిస్ట్రిక్ట్ గవర్నర్ కె.చంద్రశేఖర్‌ఆర్య పుట్టినరోజు సందర్భంగా పిల్లలకు ఆట వస్తువులను క్లబ్ అధ్యక్షుడు మామిడి అశోక్ సహకారంతో పంపిణీ చేశారు. క్లబ్ చార్టర్ ప్రెసిడెంట్ డాక్టర్ కె.చంద్రశేఖర్, పాస్ట్ జెడ్‌సీ యర్నం శ్రీరాములు, పాస్ట్ ప్రెసిడెంట్ బోగోజు నాగేశ్వరాచారి, చింతా కరుణాకర్, మదిపెద్ది వెంకటేష్, టీచర్ సరోజ పాల్గొన్నారు.